ఏపిలో పిడుగులతో కూడిన వర్షాలు





# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం, 08 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


9న మద్యం దుకాణాల మూసివేత




## ఎఫ్‌సీఆర్ఏ చట్ట సవరణపై యూఎస్ ప్రజాప్రతినిధి అభ్యంతరం..




### స్పందించిన భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 07 :** విదేశీ నిధుల నియంత్రణకు ఉద్దేశించిన ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి భారత్ చేయనున్న సవరణలపై అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు రైలీ మూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణా మాల పై భారత విదేశాంగ శాఖ స్పందిం చిం ది. చట్టాలు, వాటి సవరణలు తమ అంతర్గత విషయాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా సహా అనేక దేశాల్లో ఇలాంటి చట్టాలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో భారత్ చట్టాల రూపకల్పన చేస్తుందని చెప్పారు. దేశీయ చట్టాలకు వాటికంటూ ప్రత్యేక నేపథ్యం ఉంటుందని చెప్పారు. ఈ దృష్టికోణంలోనే చట్టాలను విశ్లేషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ప్రతిపాదిత సవరణలపై రైలీ మూర్ ఇటీవల స్పందిస్తూ పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సవరణలు చట్ట రూపం దాలిస్తే యూఎస్-భారత్ ద్వైపాక్షిక బంధాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ సవరణలతో మతపరమైన చారిటీ సంస్థలను భారత్ నియంత్రించే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే, విదేశీ నిధులతో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత, ప్రజాప్రయోజనాలు, ప్రజాస్వామిక సంస్థలపై ప్రతికూల మిగతా 3లో..

## చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట




- చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు
- బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నర్ణయం
- కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**జైపూర్,ఆగస్ట్7 :** దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమా వేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ది: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల



మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై మిగతా 3లో..

## చట్టం చేస్తున్నాం..

- బీసీలకు సంరక్షణ కల్పిస్తాం
- చేనేతలకు మేలు చేసేది అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే
- మాది బ్రాండ్ ఇమేజ్... వాళ్లది బ్యాడ్ ఇమేజ్
- జన్-జీ అభివృద్ధి కోరుకుంటోంది... జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది
- 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు జమ చేసిన సీఎం

మిగతా 3లో..

## విచారణకు సహకరించని ట్రైనీ ఐపిఎస్



- మరోమారు కస్టడీ కోరిన పోలీసులు

మిగతా 2లో..

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

- ఒంటరి పోరాటంతోనూ అధికారం సాధిస్తాం
- బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు వెల్లడి



**న్యూఢిల్లీ,ఆగస్ట్7 :** తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. సందర్భంగా తెలంగాణ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో మిగతా 3లో..

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్..

### ఏఐ సేవలకు మరింత ఊతం



**హైదరాబాద్, ఆగస్టు 07:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, భారత్‌లో తన క్లౌడ్ సేవలను మరింత విస్తరించింది. హైదరాబాద్ కేంద్రంగా "ఇండియా సౌత్ సెంట్రల్" పేరుతో తన నూతన క్లౌడ్ రీజియన్‌ను ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో దేశంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎంటర్‌ప్రైజ్ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. తెలంగాణలో ఏర్పాటైన ఈ నూతన రీజియన్ ద్వారా వినియోగదారులు తమ డేటాను స్థానికంగానే భద్రపరుచుకోవచ్చు. దీనివల్ల అత్యున్నత భద్రతతో పాటు వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పూణె, చెన్నై, ముంబై నగరాల్లో మైక్రోసాఫ్ట్‌కు క్లౌడ్ మిగతా 3లో..

## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

- కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు

**న్యూఢిల్లీ, ఆగస్టు 07:** అమెరికాలో జన్మ హక్కు పౌరసత్వం నిబంధనలను కఠిన తరం చేసే దిశగా



అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురు దెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మిగతా 3లో..

## చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం



- పీపుల్స్ ప్లాజాలో చేనేత ప్రదర్శన ప్రారంభం
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్7 :** అధికారంలోకి రావడమే బీజేపీ చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వ రావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల మిగతా 3లో..

## యువ పారిశ్రామికవేత్తల వినూత్న ఆవిష్కరణ

- మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలతో 'ఫంగీ లెదర్'
- పర్యావరణహిత ప్రత్యామ్నాయ తోలు తయారీ
- రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు.. ప్రత్యేక ప్రదర్శన

మిగతా 2లో..

## 15 రాష్ట్రాల్లో సైబర్ ముఠాల గుట్టురట్టు



మిగతా 2లో..

## విద్యార్థుల ఫీజులు డిస్‌ప్లే చేయాలి

- పాఠశాలలకు ప్రభుత్వం ఆదేశం

హైదరాబాద్,ఆగస్ట్7 : విద్యార్థుల పాఠశాల ఫీజుల వివరాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను డిస్‌ప్లే చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. పాఠశాల నోటీసు బోర్డు, వెబ్‌సైట్‌తో పాటు పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లోనూ పొందుపరచాలని స్పష్టం చేసింది. నిబంధనలు పాటించని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని.. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజుల స్ట్రక్చర్ ప్రదర్శించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

- గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు
- ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 07:** హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజుల రామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి



గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్ఆర్టీసీ గతంలో హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని మిగతా 3లో..

# ఎపిలో పిడుగులతో కూడిన వర్షాలు



## రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి

అమరావతి,ఆగస్ట్7 : ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో రానున్న 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వర్షాలకు సంబంధించిన వివరాలను ఆ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. శనివారం ఉత్తరాంధ్రలో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు తీరప్రాంతంలో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ చెప్పారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఉత్తర, మధ్య కోస్తాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వర్ష సూచన ఉన్నట్లు పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరులో వానలు పడతాయని వెల్లడించారు. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో చెదురుమదురుగా.. మార్కాపురం ప్రాంతంతో పాటు రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. సందర్భగా ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిడుగులతో కూడిన వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ వంటి వాటి వద్ద నిలబడవద్దని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.

# ఈనెల 10న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 7 : కొత్తగూ డెంలో నిశేషగిరి భవన్‌లో కార్మిక సంఘాల నాయకుల విలేకరుల సమావేశం నిర్వహించారు. 12వ వేజ్ బోర్డు అమలులో జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 10న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ..సింగరేణి కార్మికులకు 12వ వేతన సంఘం ఏఃఅఅఎ కమిటీని ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం చాలా మొండి వైఖరిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కోల్ ఇండియా యాజమాన్యం సైతం తక్కువ వేతనాలతో 12వ వేజ్ బోర్డును తక్కువ వేతనాలతో సరి చేయాలని చూస్తున్నారని, కుట్ర జరుగుతుందని విమర్శించారు. జెబిసిసిఐ జూలై 12 2026 నుండి 12వ వేతన సంఘం అమరి చేయాల్సి ఉందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ని అమలు చేసి కోల్ ఇండియాలో ఉన్న బొగ్గు గని కార్మికులకు నాలుగు లేబర్ కోడ్స్ ను అమలు చేసి, కేంద్ర సంఘాలకు కూడా ఎన్నికలు పెట్టాలని కుట్రలు చేస్తుందని విమర్శించారు.51 శాతం ఓట్లు వచ్చిన యూనియన్ ను వన్ యూనియన్ ఫర్ వన్ ఇండస్ట్రీ విధానం అమలు చేసేదుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 20 శాతం ఓట్లు వచ్చిన వారు మాత్రమే ట్రేడ్ యూనియన్ నెగోషియేషన్లో ఉండాలన్న కండిషన్ల పేరుతో 12 వేజ్ బోర్డును జాప్యం చేస్తున్నారని విమర్శించారు.ఈ నేపథ్యంలో జాతీయ బొగ్గు గని కేంద్ర కార్మిక సంఘాలు ఐక్యమై ఈనెల 10వతారీఖున ఆల్ జనరల్ మేనేజర్స్ కార్యాలయాల ఎదుట కార్మికుల ధర్నా చేయనున్నట్లు తెలిపారు.సెప్టెంబర్ 12వతారీఖున దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులు, అఖిలపక్ష కేంద్ర కార్మిక సం ఘాల ఆధ్వర్యంలో పెద్ద సదస్సును ఏర్పాటు చేసి 12వ వేజ్ బోర్డు కార్మికులకు లాభదాయకంగా ఉం డాలని, కోల్ ఇండియాలో ఉన్న యాజమాన్యం నుం డి వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.

# వివాదాస్పద ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు




- ఉభయ సభల

## ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ

న్యూఢిల్లీ,ఆగస్ట్7 : వివాదాస్పద ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా తమ పార్టీకి చెందిన ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ చేసింది. ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై ప్రభుత్వం చర్చ చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ కాంగ్రెస్ ఎంపీలు తప్పనిసరిగా హాజరు కావాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో తమ తమ సభల్లో తప్పనిసరిగా హాజరు కావాలని పార్లమెంటు సభ్యులను కోరింది. ఈ మేరకు రాజ్యసభలోని కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేశ్ విప్ జారీ చేశారు. ఈ సందర్భంగా 2026 ఆగస్టు 10, 11, 12 తేదీల్లో రాజ్యసభలో చాలా ముఖ్యమైన అంశాలను చర్చకు తీసుకోనున్నట్లు జైరామ్ రమేశ్ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు తప్పనిసరిగా సభలో సభ్యులు ఉండాలని, పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించాలని కోరారు. మరోవైపు, లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకూ పార్టీ ఇదే విధమైన విప్ జారీ చేసింది. ఆ మూడు రోజుల పాటు కాంగ్రెస్ ఎంపీలంతా తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొంది. అదేవిధంగా ఇండియా కూటమిలోని అన్ని మిత్రపక్షాలకు ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయా పార్టీల ఎంపీలందరూ హాజరుకావాలని కోరింది.కాగా, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, వచ్చే వారం జరగబోయే తాత్కాలిక ప్రభుత్వ కార్యకలాపాల జాబితాను పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. దాంట్లో ఆ రెండు బిల్లుల గురించి మంత్రి ఎక్కడా ప్రస్తావించలేదు.

# జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన

- మహిళనూ సామూహి అత్యాచారం
- ఆపై ఫోన్‌లో వీడియోలతో బెదిరింపులు
- దుండగులను అరెస్ట్ చేసిన రిమాండ్ కు తరలించిన పోలీసులు



జగిత్యాల,ఆగస్ట్7: జగిత్యాల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మల్యాల మండలం నూకపల్లి శివారులోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో ఇద్దరు వ్యక్తులు ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేసి బాధితురాలిని వీడియో తీసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి శుక్రవారం సాయంత్రం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఈనెల 3న నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ నూకపల్లి శివారులోని రెండు పడకగదుల ఇళ్ల కాలనీలో తనకు తెలిసినవారి ఇంటికి వచ్చింది. మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, గుర్రం శ్రీకాంత్ అనే యువకులు సదరు మహిళ ఉన్న ఇంట్లోకి ప్రవేశించి.. ఆమె తనకు సన్నిహితంగా వున్న ఓ వ్యక్తితో కలిసివున్న దృశ్యాలను తమ ఫోన్‌లో చిత్రీకరించారు. తర్వాత ఆమెపై వారిరువురు సామూహిక అత్యాచారానికి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మారవేని మల్లేశ్, రాజారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య నిందితులకు సహకరించారు. అనంతరం నరేశ్, శ్రీకాంత్ బాధిత మహిళకు ఫోన్ చేసి తాము తీసిన వీడియోను పలువురికి పంపిస్తామని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడంతో గురువారం బాధితురాలు మల్యాల ఠాణాలో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్టు చేసి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులు వినియోగించిన ఇన్నోవా క్రిస్టా కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1 నిందితుడు శివరాత్రి నరేశ్‌పై 13, ఏ-2 నిందితుడు గుర్రం శ్రీకాంత్‌పై 9 పాత కేసులతోపాటు రౌడీ షీట్లు ఉన్నట్లు వివరించారు. ఏ-3 నిందితుడు మారవేని మల్లేశ్‌పై 2, గుర్రం అంజయ్యపై ఒక కేసు గతంలో నమోదై ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థుల కదలికలపై కూడా ప్రత్యేక నిఘావేస్తామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సీఐతోపాటు ఎస్సై సందీప్, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

## పిడిఎస్‌యు డిమాండ్



నిజామాబాద్, ఆగస్టు 7 : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు ఆర్మూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని విద్యార్థులు పట్ల ఆమానుషంగ బూతులు తిడుతున్న వాడిని సస్పెండ్ చేయాలని నిజామాబాద్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందించడం జరిగింది... ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులుడి నిఖిల్....... మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణ కేంద్రంలో గల ప్రభుత్వ ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు వసతిపురం ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా నేటి వరకు విద్యార్థులకు సకాలంలో పౌష్టికంగా మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని అన్నారు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వసతి గృహ వార్డెన్ గోదావరి గారిని విద్యార్థులు అడగగా తనకు ఇష్టం వచ్చిన రీతిలో విద్యార్థులు బూతులు తిడుతూ మీరు హాస్టల్ నుండి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తుందని అన్నారు.. అదేవిధంగా విద్యార్థులు వార్డెన్ దగ్గరికి మెనూ ప్రకారం భోజనం అందించాలని అడిగితే మీరు మహిళ అని చూడకుండా దగ్గరికి వస్తారా అంటూ వారిని భయభ్రాంతులకు గురి చేయడం జరుగుతుందని అన్నారు అంతేకాదు వసతి గృహంలో పరిశుభ్రత పాటించడం లేదని మూత్రశాలలు బాత్రూంలను సైతం సరిగ్గా పరిశుభ్రతగా ఉంచకుండా పూర్తిగా గదులలో వాసనతో నిండిపోయిందని అన్నారు.. అదేవిధంగా బాలుర వసతి గృహంలో మహిళా వార్డెన్ ను వెంటనే తొలగించాలని విద్యార్థులకు పౌష్టికంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని వారి డిమాండ్ చేశారు లేని పక్షంలో పాడెన్ మేడంను తొలగించే వరకు పోరాటం విద్యార్థులతో కలిసి చేస్తామని వారు హెచ్చరించారు .. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా కార్యదర్శి యాస్ దుర్గా ప్రసాద్ ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి రాజు , నాయకులు వినోద్ ఎస్టి బాయ్స్ కాలేజ్ హాస్టల్ అధ్యక్షుడు పి. రాజేష్ , ప్రధాన కార్యదర్శి ఎస్. మంగల్దీ , ఉపాధ్యక్షుడు బాలాజీ , భార్గవ్ , సహాయ కార్యదర్శి ఆదిత్య , నాయకులు వినోద్ , అజయ్ , తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్‌గా నవీన్ పెత్తెం

హైదరాబాద్, ఆగస్టు 07: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)లో పలు కీలక నియా మకాలు జరిగాయి. టీపీసీసీ సోషల్ మీడియా విభాగానికి నూతన ఛైర్మన్‌గా నవీన్ పెత్తెంను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. అలాగే మీడియా, పబ్లిసిటీ విభాగం ఛైర్మన్‌గా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్‌గా పనిచేసిన నవీన్ పెత్తెం, ప్రస్తుతం రాష్ట్ర రవాణా అథారిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయనతో పాటు సోషల్ మీడియా విభాగానికి కన్వీనర్లుగా కె.ఉజ్వల్ రెడ్డి, పి.వంశీకృష్ణలను నియ మించారు. అంబాల శివకుమార్, విష్ణు వర్ధన్ రెడ్డి, వీరాపురం రామ్ లక్ష్మణ్, గీత అయినాల, ఎండీ అబిద్ అలీ, సుశీల్ కుమార్‌లను కోఆర్డినేటర్లుగా ఎంపిక చేశారు. అయితే, సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్ పదవిని స్వీకరించేందుకు గీత అయినాల నిరాకరించారు. ప్రస్తుతం టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కన్వీనర్‌గా ఉన్న ఆమె, ఈ నియామకం పట్ల ధన్యవాదాలు తెలుపుతూనే, ఈ పదవిని తాను స్వీకరించడం లేదని 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. తన పేరును జాబితా నుంచి తొలగించాలని నవీన్ పెత్తెంను కోరారు. ఆమె నిరాకరణకు గల కారణాలు వెంటనే తెలియరాలేదు. మరోవైపు, నవీన్ పెత్తెం నియామకంపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మద్దతుదారులు విమర్శలు గుప్పించారు. కొత్త బాధ్యతలపై ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ.. తనకు ఈ అవకాశం కల్పించిన ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ వాణిని తెలంగాణ అంతటా బలంగా వినిపిస్తానని ఆయన పేర్కొన్నారు.

# నిజాయితీ ఉంటే అమిత్ షాతో రాజీనామా చేయించండి

## మోహన్ భాగవత్‌కు కేసీ వేణుగోపాల్ సవాల్?



హైదరాబాద్, ఆగస్టు 07: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ ఇటీవల జెన్-జీపై చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం తీవ్రంగా స్పందించారు. యువత పట్ల ఆయనకు నిజంగా నిజాయితీ ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేత రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. అంతేకాదు ప్రస్తుతం ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ నడిపిస్తోందని, కనుక నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై ఇటీవల జరిగిన పోలీసు చర్యకు ఆ సంస్థే బాధ్యత వహించాలని అన్నారు.ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ నియంత్రిస్తోంది. వారికి జెన్ జీ యు వతపై నిజంగానే శ్రద్ధ ఉంటే, కేంద్ర హోంమంత్రిని రాజీనామా చేయమని మోహన్ భాగవత్ అడగాలి. లేదంటే కనీసం పార్లమెంట్?కు వచ్చి విద్యార్థులకు, అలాగే ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పాలి. విద్యార్థుల పట్ల ఆయనకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, పెల్లెట్ గన్స్, లాఠీఛార్జ్ రూపంలో విద్యా ర్థులపై జరిగిన అణచివేతను ఆయన ఖండించాలి. కానీ దీనిపై ఆయన ఎందుకు మౌనంగా ఉన్నార? ఇవన్నీ కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమేనని అన్నారు.

# విచారణకు సహకరించని ట్రైనీ ఐపిఎస్

- మరోమారు కస్టడీ కోరిన పోలీసులు



హైదరాబాద్,ఆగస్ట్7 : ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా కస్టడీలో కృష్ణారెడ్డి నోరు మెద పలేదని తెలుస్తోంది.పోలీసులు అడిగిన చాలా ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పేందుకు నిరాకరించినట్లు సమాచారం. దీంతో మరోసారి కస్టడీకి కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు కృష్ణారెడ్డి సహకరించలేదని, మరికొన్ని కీలక విషయాలు తెలుసుకునేందుకు నిందితుడిని కస్టడీకి అప్పగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నాడు కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది. కాగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమిలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై కృష్ణారెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి. అత్తాపూర్ పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. విచారణలో భాగంగా కృష్ణారెడ్డిని తమకు రెండు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గత బుధవారం కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు గురు, శుక్రవారాల్లో అత్తాపూర్ పోలీస్ స్టేషన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారుల పర్యవేక్షణలో విచారణ జరిగింది. అయితే, కృష్ణారెడ్డి సహకరించకపోవడంతో పోలీసులు మరోసారి కోర్టును ఆశ్రయించారు.

## ఎఫ్‌సీఆర్ఏ చట్ట సవరణపై యూఎస్ ప్రజాప్రతినిధి అభ్యంతరం.. స్పందించిన భారత్

న్యూఢిల్లీ, ఆగస్టు 07 : విదేశీ నిధుల నియంత్రణకు ఉద్దేశించిన ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి భారత్ చేయనున్న సవరణలపై అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు రైలీ మూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. చట్టాలు, వాటి సవరణలు తమ అంతర్గత విషయాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా సహా అనేక దేశాల్లో ఇలాంటి చట్టాలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో భారత్ చట్టాల రూపకల్పన చేస్తుందని చెప్పారు. దేశీయ చట్టాలకు వాటికంటూ ప్రత్యేక నేపథ్యం ఉంటుందని చెప్పారు. ఈ దృష్టికోణంలోనే చట్టాలను విశ్లేషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ప్రతిపాదిత సవరణలపై రైలీ మూర్ ఇటీవల స్పందిస్తూ పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సవరణలు చట్ట రూపం దాలిస్తే యూఎస్-భారత్ ద్వైపాక్షిక బంధాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ సవరణలతో మతపరమైన చారిటీ సంస్థలను భారత్ నియంత్రించే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే, విదేశీ నిధులతో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత, ప్రజాప్రయోజనాలు, ప్రజాస్వామిక సంస్థలపై ప్రతికూల ప్రభావం పడకుండా భారత్ ఎఫ్‌సీఆర్ఏ చట్టాన్ని గతంలో తీసుకొచ్చింది. ఇక విదేశీ నిధులతో నడిచే సంస్థల కార్యకలాపాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం, మెరుగైన నిర్వహణ కోసమే తాజా మార్పులను ప్రతిపాదిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

# డాక్టర్ రమేష్ సస్పెండ్

సంగారెడ్డి జిల్లా, ఆగస్టు 7:జోగిపేట్ గవర్నమేంట్ ఆసుపత్రిలో నకిలీ డాక్టర్ బండారం బైటపడింది. వైద్య ఆరోగ్య శాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ నియోజకవర్గం లో ఈ ఘటన జరిగింది. డ్యూటీ చేయాల్సిన డాక్టర్ రమేష్ స్థానంలో రవిఅనే వెక్తి డ్యూటీ లో ఉండగా,డాక్టర్ రమేష్ సంగారెడ్డిలో తన సొంత ఆసుపతిలోఉన్నారు. విషయంతెలుసుకున్నఅధికారులు డాక్టర్ రమేష్‌ను సస్పెండ్ చేసారు.

## కారు బీభత్సం

నిజామాబాద్, ఆగస్టు 7 : నందిపేట్ మండల కేంద్రంలో కారు బీభత్సం సృష్టించింది.నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల కేంద్రంలో రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ఓ కారు రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం కారు నందిపేట్ మండల కేంద్రంలోని గుత్ప కెనాల్ సమీపానికి చేరుకుని అగ్నికి ఆహుతైంది. మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా కాలిబూడిదైంది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికిగలకారణాలపైపోలీసులుకేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

(మొదటిపేజీ తరువాయి)

## చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట



విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత ప్రక్రియగా మార్చడం, ఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు, తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యం

చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశర చేశారని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్.. రాష్ట్రానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశర చేస్తారన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు. కాగా, ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్‌ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్‌ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్..

రీజియన్లు ఉండగా, తాజా విస్తరణతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ కలిగిన సంస్థగా మైక్రోసాఫ్ట్ నిలిచింది. సేవల్లో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ఉండేందుకు వీలుగా ఈ కేంద్రంలో మూడు అవైలబిలిటీ జోన్‌లను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, 2030 నాటికి నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇందులో "జీరో-వాటర్ కూలింగ్" సాంకేతికతను వినియోగిస్తున్నారు. అదానీ గ్రూప్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీబీ పే వంటి ప్రముఖ భారతీయ సంస్థలు ఇప్పటికే ఈ హైదరాబాద్ రీజియన్ సేవలను వినియోగించుకుంటున్నాయి. భారత్‌లో డిజిటల్, ఏఐ మౌలిక సదుపాయాల కోసం మైక్రోసాఫ్ట్ ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులలో భాగంగా ఈ నూతన రీజియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికతతో విలువైన ఫలితాలను సాధించాలంటే, డేటాకు సమీపంలో నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు.

## చేనేత సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.



## చట్టం చేస్తున్నాం..బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

- చేనేతలకు మేలు చేసేది... అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే
- మాది బ్రాండ్ ఇమేజ్... వాళ్లది బ్యాడ్ ఇమేజ్
- జన్-జీ అభివృద్ధి కోరుకుంటోంది... జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది
- 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- చీరాలలో నేతన్న సేవలో పథకం ప్రారంభం
- కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు జమ చేసిన సీఎం



చీరాల, ఆగస్టు 7 : బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నా మని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రం గంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం.స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు. బీసీలకు అండగా... "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బీసీలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికి అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మతులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం... రూ. 12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా... గడచిన 2 ఏళ్లల్లో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 ఏళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు. గత పాలనలో రాజధాని లేకుండా చేశారు... రాష్ట్రం పేరు చెబితే ఇతర ప్రాంతాల్లో చులకన అయ్యేలా చేశారు. అద్భుతమైన నగరం ఉండాలనే అమరావతిని నిర్మిస్తున్నాం. రాజధానిపై గత పాలకులు నాలుక మడతపెట్టారు. మూడు ముక్కలాట ఆడారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. దేశంలో ఏ రాష్ట్రమైనా తమ రాజధాని నగరాలను ఘనంగా చెప్పుకుంటున్నాయి. గత పాలనలో రాజధానే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. ఆగస్టు 13 తేదీన రాజధానిలోని ప్రధాన రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం అవుతుంది. వేగంగా జరుగుతున్న పనులు చూసి రాజధానిపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు. మావిగన్, వాటికన్ అంటూ ఏవోవో చెబుతున్నారు. మళ్లీ మూడు ముక్కలాట కావాలా...? రాజధానిని విధ్వంసం చేసుకుంటామా..? కుటుంబానికి ఇల్లు, రాష్ట్రానికి రాజధాని అవసరం. గత ప్రభుత్వం రాష్ట్ర పరువును తీసేసింది. ఇమేజ్ ను దారుణంగా దెబ్బతీసింది. కూటమి వచ్చాక మళ్లీ ఏపీ బ్రాండ్ ను పునరుద్ధరించాం. పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమల్ని ఏర్పాటు చేయిస్తున్నాం. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను నేరాలు, ఘోరాలు చేసే వ్యక్తుల్ని ప్రోత్సహిస్తూ కొందరు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తు న్నారు. కుట్రలను ప్రజలు గమనించాలి... కుట్రదారులను దూరం పెట్టాలి. ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలి."అని సీఎం చంద్రబాబు కోరారు.

**మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం"**

చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతు న్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం.

## చేనేత కళను పరిరక్షిద్దాం.. చేనేత వస్త్రాలను ధరిద్దాం.



ఏలూరు, ఆగష్టు 7 : జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏలూరు జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రారంభించారు. కలెక్టర్ వెట్రి"ఎల్వి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి లో భాగమైన చేనేత కళను పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలన్నారు.చేనేత కార్మికుల సంక్షేమానికి, చేనేత రంగాన్ని బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తున్నదన్నారు. నేతన్న సేవలో పథకంలో అర్హులైన ప్రతీ చేనేత కార్మికులకు 25 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నాయని, అంతేకాక చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల వరకూ ఉచితవిద్యుత్ అందిస్తోందన్నారు. చేనేత సహకార సంఘాలకు ప్రత్యేక మౌలిక సదు పాయాలు అందిస్తున్నామ న్నారు. చేనేత వస్త్రాల ను ధరించడం ద్వారా చేనేత కార్మికులను ప్రోత్సహి స్తూ భారతీయ సంస్కృతి లో భాగమైన చేనేత కళ ను సంరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలనీ కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఎం. శ్రీదేవి, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి కె. అప్పారావు, అభివృద్ధి అధికారిబి.హనుమంతరావు, మేనేజర్ తుమ్మల సుబ్బారావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్ రెడ్డి,బిసి కా ర్పొరేషన్ ఈడి పుష్పలత, గృహ నిర్మాణ శాఖ పిడి సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ నాంచారయ్య, చేనేత సంఘాల ప్రతినిధులు గుంటూరు సత్యవతి, మారకా శివయ్య, పోలిన వీరాస్వామి, దొడ్డిపట్ల కోటిలింగం,, నరుని లక్ష్మారావు, దివి లక్ష్మి, ప్రభృతులు పాల్గొన్నారు.

## యువ పారిశ్రామికవేత్తల వినూత్న ఆవిష్కరణ

- మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలతో 'ఫంగీ లెదర్'
- పర్యావరణహిత ప్రత్యామ్నాయ తోలు తయారీ
- రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు.. ప్రత్యేక ప్రదర్శన

హైదరాబాద్, ఆగస్టు 07: బూట్లు, బ్యాగులు, బెల్టులు, జాకెట్లు, వాహనాల సీట్లు ఇలా మనం రోజూ ఉపయోగించే ఎన్నో వస్తువుల తయారీలో జంతువుల తోలును విస్తృతంగా వినియోగిస్తుం టారు. అయితే దీనికోసం లక్షలాది జంతువులు బలవుతుండగా, పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నంలో ఒడిశాకు చెందిన ఓ స్టార్టప్ వినూత్న ఆవిష్కరణ చేసింది. శిలీంధ్రాల (ఫంగస్)లోని భాగమైన మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి జంతు తోలుకు ప్రత్యామ్నాయంగా 'ఫంగీ లెదర్'ను అభివృద్ధి చేసింది. ఈ పర్యావరణహిత ఉత్పత్తి ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. ఒడిశాకు చెందిన అర్బన్-హైఫ్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌ను యువ పారిశ్రామికవేత్తలు నిషరాజ్ మహాపాత్ర, వివేక్ సింగ్ అనే ఇద్దరు స్నేహితులు స్థాపించారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఫ్యాషన్ రంగంలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో వీరు ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారు. శిలీంధ్రాల్లోని ప్రధాన భాగమైన మైసీలియంను ప్రత్యేక పద్ధతిలో పెంచి, దానిని సాగే గుణం కలిగిన తోలుగా మార్చే ప్రక్రియను రూపొందించారు. దీనివల్ల జంతు తోలు, సింథటిక్ లెదర్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల నాణ్యమైన బయో మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఈ వినూత్న ఉత్పత్తికి ఇప్పటికే విశేష గుర్తింపు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో ఈ స్టార్టప్ తమ ఉత్పత్తులను ప్రదర్శించగా ప్రశంసలు అందుకుంది. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక బయోటెక్నాలజీ కలయికతో రూపొందిన ఈ ఫంగీ లెదర్ భవిష్యత్తులో ఫ్యాషన్ పరిశ్రమకు కొత్త దిశ చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్ తయారు చేస్తున్న ఫంగీ లెదర్‌తో బ్యాగులు, బూట్లు, పర్సులు, బెల్టులు, వాచ్ పట్టీలు, దుస్తులు వంటి ఉత్పత్తులను రూపొందిస్తు న్నారు.భవిష్యత్తులోఫర్నిచర్, ఇంటీరియర్ డిజైన్, ఆటోమొబైల్ పరిశ్రమ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల తయారీలో కూడా దీనిని వినియోగించే అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ బయో మెటీరియల్‌ను ప్యాకేజింగ్, నిర్మాణ రంగం, ఇన్సులేషన్ మెటీరియల్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చని వారు పేర్కొంటున్నారు. ఫంగీ లెదర్ తయారీ తర్వాత మిగిలిపోయే సేంద్రియ పదార్థాలను కూడా పూర్తిగా రీసైకిల్ చేయడం వల్ల వ్యర్థాలు దాదాపు ఉండవు. ఈ వినూత్న ఉత్పత్తి తయారీకి వరి పొట్టు, చెక్క ముక్కలు వంటి వ్యవసాయ వ్యర్థాలను వినియోగిస్తారు. ముందుగా వాటిని క్రిమిరహితం చేసి, ప్రయోగశాలలో తయారుచేసిన ప్రత్యేక పోషక మాధ్యమంతో కలుపుతారు.

## 15 రాష్ట్రాల్లో సైబర్ ముఠాల గుట్టురట్టు

### మొత్తం 49 మంది నిందితుల అరెస్టు

హైదరాబాద్,ఆగస్ట్7 : సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. తెలంగాణ సహా 15 రాష్ట్రాల్లో విస్తరించిన సైబర్ ముఠాల గుట్టురట్టు చేశారు. మొత్తం 49 మంది నిందితులను అరెస్టు చేసి, రికవరీ చేసిన రూ.98.89లక్షల డబ్బును బాధితులకు రిఫండ్ చేశారు. జులైలో 70 సైబర్ క్రైమ్ సంబంధిత ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రేడింగ్ మోసాలే అత్యధికంగా జరిగాయని.. ఆ కేసుల్లో 29 మందిని అరెస్టు చేశామని వివరించారు. మొత్తంగా 25 డెబిట్‌కార్డులు, 23 మొబైల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.జోనల్ సైబర్ సెల్స్ ద్వారా 298 కేసులు నమోదు కాగా.. ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. 128 నకిలీ సోషల్‌మీడియా ప్రొఫైల్లు, 36 నకిలీ యాడ్స్‌ను బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే కాల్స్ పూర్తిగా నకిలీవేనని పోలీసులు స్పష్టం చేశారు. వాటిని నమ్మొద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

## బోనాల పండగతో 9న మద్యం దుకాణాల మూసివేత

హైదరాబాద్,ఆగస్ట్7 : మందుబాబులకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేశ్ షాక్ ఇచ్చారు. బోనాల పండుగ సందర్భంగా ఆగస్టు 9న మద్యం దుకాణాలను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లు మూసివేయాలని సీపీ రమేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని సీపీ రమేశ్ పేర్కొన్నారు. రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లకూ ఈ ఆదేశాలు వర్తిస్తాయని ఆయన తెలిపారు. అయితే స్టార్ హోటళ్లలోని బార్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లకు మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. ప్రజా శాంతి, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బోనాల వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ రమేశ్ పేర్కొన్నారు.

## ఎక్స్‌ప్రెస్ రైలుకు తప్పిన ముప్పు

సంగారెడ్డి,ఆగస్ట్7 : బీదర్ నుంచి యశ్వంతపూర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం జహీరాబాద్ రైల్వే స్టేషన్‌కు సమీపిస్తున్న సమయంలో రైలు ఇంజన్ వెనుకాలే ఉన్న ఏసీ బోగీ నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. దీన్ని గమనించిన రైల్వే అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా రైలును వెంటనే స్టేషన్‌లో నిలిపివేశారు.రైల్వే సాంకేతిక సిబ్బంది ఏసీ బోగీని పరిశీలించారు. ఆ బోగీలోని బ్యాటరీలో తలెత్తిన సాంకేతిక లోపం వల్లే పొగలు వచ్చినట్లు గుర్తించారు. అనంతరం సిబ్బంది త్వరితగతిన ఆ లోపాన్ని సరిచేసి మరమ్మతులు పూర్తి చేశారు. సమస్య తొలగిపోవడంతో రైలు తిరిగి యశ్వంతపూర్ వైపు సురక్షితంగా బయలుదేరింది. ఈ ఘటనతో రైలు కాస్త ఆలస్యంగా బయలుదేరింది. అధికారుల సమయస్ఫూర్తితో పెద్ద ముప్పు తప్పడంతో ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కాలంలో రైళ్లలో చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కోరుతున్నారు.

# సంపాదకీయం

## ప్రజా సమస్యలపై శ్రద్ధపెట్టని పార్లమెంటు !

పార్లమెంట్ సమావేశాలు నానాటికీ దిగజారి పోతున్నాయి. అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందరగోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృధా చేస్తున్నారు. వర్షాకాల సమావేశాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. అసలు మోడీ హయాంలో చర్చలు సాగడం లేదని అనుకుంటుంటే విపక్షం అంతకుమించి అన్నట్లుగా పార్లమెంట్ స్తంభనకే పట్టుబడతోంది. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే గత కొన్ని ఏళ్లుగా పరిశీలన చేస్తే అసలు చర్చలు సాగడం లేదు. అర్థవంతమైన చర్చలు అస్సలు చేయడం లేదు. విపక్షలు పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి, పార్లమెంట్ బయట ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ఎన్నో అవకాశాలు ఉంటాయి. ఎన్నో రూల్స్ ఉంటాయి. వారు చర్చించాల్సన విషయాలను ఈ పద్దతిలో చర్చించడం లేదు. కేవలం రాజకీయం క ఓసం రచ్చ మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఇకపోతే స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్ష పాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరామ్ జాకడ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలకు ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది అర్థం అవుతోంది. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడడం, వారిని అనునయించడం జరిగేది. వారు ఏం కోరుకుంటున్నారో మైక్ ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చు. కానీ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన అరోపణ. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు పదేపదే అరోపిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఈ సీజన్‌లో అసలు విపక్ష సభ్యులు కూడా మాట్లాడకుండా పోడియం వద్దకు రావడం, నినాదాలు చేయడం, వెళ్లిపోవడం అలవాటు చేసుకు న్నారు. దీంతో స్పీకర్ కూడా సభను వాయిదా వేసి పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ సభకు హాజరు కావడం లేదు. విద్యార్థుల సమస్యలు కావచ్చు, ఇతర సమస్యలు కావచ్చు..ప్రధాని మాట్లాడడం లేదు. కేవలం సోషల్ మీడియా ద్వారా తన భావాలను వెల్లడిస్తున్నారు. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా అర్థం అవు తోంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరు గు దల వంటి అనేకసమస్యలు ఉన్నాయి. సమావేశాల్లో అనేక అంశాలపై చర్చకు అవకాశం ఉంటుంది.కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అం శాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వాజ్‌పేయ్, పివి నరసింహా రావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లో నూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చ లకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభ నుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడ డం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చు కుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చ లకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి.

అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్య బద్దంగా పనిచేయ డానికి సిద్దంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని సభకు రావడం మర్యాద. విపక్షాలకు కూడా ఆయన సూచనలు చేయవచ్చు. కానీ మంత్రులతోనే పనికానిచ్చేద్దాఆమంటే సరికాదు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. దీనిని గుర్తించకుంటే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారు.

## విదేశీ విరాళాలపై ఆంక్షల కత్తి

- కొత్త బిల్లుతో దేశంలో సేవాకార్యక్రమాలకు గండి
- కేంద్రం తీరుపై మండిపడ్డ ఎంపి శశిథరూర్




న్యూఢిల్లీ, ఆగస్టు 07 : దేశంలో విదేశీ నిధుల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధుల నియంత్రాణ చట్టం సవరణ–2026 బిల్లును తీసుకువచ్చింది. దీనిద్వారా ప్రస్తుతం అమలులో ఉన్న విదేశీ విరాళాల నియంత్రణ చట్టం మరింత కఠినతరం కానుంది. ఈ బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని కేంద్రం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు–2026పై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న ఈ కొత్త బిల్లు దేశంలోని పౌర సమాజంపై ప్రభుత్వ నియంత్రణను మరింత పెంచేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు.. స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల సంఘాలను సమాజంలో అభివృద్ధి భాగస్వాములుగా కాకుండా, విదేశీ ప్రమేయాలుగా చూపేలా ఉన్నాయని శశిథరూర్ ఆరోపించారు. 'ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దయినా, గడువు ముగిసినా లేదా సరెండర్ చేసినా.. ఆ సంస్థలకు చెందిన విదేశీ విరాళాలు, ఆస్తుల నిర్వహణను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకునేందుకు ఈ కొత్త బిల్లు వీలు కల్పిస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక 'అధికార యంత్రాంగం' ఏర్పాటుకు కేంద్రం పావులు కదుపుతోంది. ఈ నిబంధన ద్వారా పాలనా పరమైన నిర్ణయాలతోనే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే ఆస్పత్రులు, విద్యాసంస్థలు, భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉంది' అని థరూర్ ఆరోపించారు. కేరళలో పలు ఛారిటబుల్ ట్రస్ట్‌లు, పాఠశాలలు, ఆస్పత్రులు గత శతాబ్ద కాలంగా కులమతాలకు అతీతంగా పేదలకు వైద్య, విద్యా సేవలు అందిస్తున్నాయని థరూర్ గుర్తుచేశారు. ఈ సంస్థలు స్థానిక విరాళాలతో పాటు విదేశీ నిధుల ద్వారా ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చుకుంటూ పేదలకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు. ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనల పేరుతో ఈ సంస్థలను వేధించడం, ఆస్తులను జప్తు చేయడం వల్ల చివరికి నష్టపోయేది సామాన్య ప్రజలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కఠినమైన నిబంధనల వల్ల విదేశీ నిధులు 87 శాతం మేర తగ్గిపోయి వేలాది సేవా సంస్థలు మూతపడ్డాయని, ఇప్పుడు తెస్తున్న ఈ కొత్త బిల్లు వాటిని శాశ్వతంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని థరూర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కక్షసాధింపు చర్యల వల్ల కోట్లాది మంది పేదలకు అందుతున్న వైద్య, విద్య సేవలు నిలిచిపోతాయని హెచ్చరించారు.

## మెటా తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్



- తన ఖాతాను నియంత్రిండంపై ఆక్షపణ
- ప్రధాని మోడీ ఒత్తిళ్లకు తలొగ్గద్దని సూచన

న్యూఢిల్లీ,ఆగస్ట్7 : ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌లో తన ఖాతాను ఎందుకు నియంత్రించారని ఆయన ప్రశ్నించారు. తన అకౌంట్ నియంత్రణపై మెటా అధికారులను ప్రశ్నిస్తే సరిగా సమాధానం ఇవ్వడం లేదని, ఈమెయిల్ పంపినా కూడా స్పందించడం లేదన్నారు. ప్రధాని మోదీ ఒత్తిళ్లకు తలగొద్దని మోటా సంస్థకు కేజ్రీవాల్ సూచించారు. తన సోషల్ మీడియా ఖాతాను భారత్‌లో ఎందుకు నిలిపివేశారో సంస్థ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. మెటా ఇండియా కార్యాలయంలో మౌఖికంగా విచారించినా ఎలాంటి సరైన సమాధానం రాలేదని, తాము పంపిన ఈమెయిల్స్‌కు సాధారణ రసీదులు మాత్రమే వస్తున్నాయని ఆరోపించారు. ఇది చాలా చెత్త సేవ అంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఒత్తిళ్లకు తలవంచకండి.. లేదంటే భవిష్యత్తులో దేశంలో ప్రధాని ఖాతా ఒక్కటే నడుపుకోవ డానికి మిమ్మల్ని అనుమతిస్తారు' అంటూ ఆయన ఎద్దేవా చేశారు. మెటా సంస్థ తన సేవలను మరింత బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని కేజ్రీవాల్ అన్నారు. కాగా, దేశంలో మెటా సంస్థపై ప్రస్తుతం తీవ్రస్థాయిలో ప్రభుత్వ నిఘా, విచారణ కొనసాగుతున్న తరుణంలో కేజ్రీవాల్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## తరుణ్ తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు

ముంబై,ఆగస్ట్7 : 2013 నాటి లైంగిక దాడి కేసులో తెహెల్కా మాజీ సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్‌ను బాంబే హైకోర్టులోని గోవా ధర్మాసనం దోషిగా నిర్ధారించింది. 2021లో మాపుసా కోర్టు ఇచ్చిన తీర్పును ఈ ధర్మాసనం రద్దు చేసింది. జస్టిస్ డాక్టర్ నీలా గోఖలే, జస్టిస్ అమిత్ జమ్సందేకర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది. ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద తరుణ్ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. అతడికి విధించిన శిక్షను ధర్మాసనం ప్రకటించనుంది. గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. కుమార్తె వయస్సు ఉన్న యువతితో అతడు ఈ విధంగా వ్యవహరించారని తెలిపారు. బాధితురాలు పదే పదే తిరస్కరించినప్పటికి తేజ్‌పాల్ తన ప్రయత్నాలను కొనసాగించాడని పేర్కొన్నారు. అదీకాక మ్యాగజైన్ సంపాదకుడిగా అతడు గౌరవమైన స్థానంలో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడు తరుణ్ తేజ్‌పాల్‌కు గరిష్టంగా శిక్ష విధించాలని ఈ సందర్భంగా కోర్టుకు తుషార్ మెహతా విజ్ఞప్తి చేశారు. 2013లో గోవాలోని ఓ రిసార్ట్ వేదికగా తెహెల్కా పత్రిక థింక్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా మ్యాగజైన్ సంపాదకుడు తరుణ్ తేజ్ పాల్ తనపై లైంగిక దాడి చేశాడని సహోద్యోగి ఆరోపించారు. మరికొద్దిసేపట్లో కోర్టు అతడికి శిక్ష విధించనుంది. ఈ నేపథ్యంలో తేజ్‌పాల్ స్పందించారు. తనపై దయ చూపాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. తన వయస్సు 62 ఏళ్లని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాను బాధితుడిని నమ్ముతున్నానని అన్నారు. తనకు భార్య కూడా ఉందని పేర్కొన్నారు. అంతుకు మించి చెప్పడానికి ఏమీ లేదంటూ తేజ్‌పాల్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

## తెహల్కా ఎడిటర్‌కు పదేళ్ల జైలు

- లైంగిక దాడి కేసులో శిక్ష ఖరారు చేసిన కోర్టు
- రెండువారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం
- రాజకీయంగా తనపై కక్షసాధింపు చేపట్టారన్న తేజ్‌పాల్



ముంబై,ఆగస్ట్6 : తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు శిక్ష పడింది. 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ కీలక తీర్పు వెలువరించింది. పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. అతడు రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో జూనియర్ సహోద్యోగినిపై అత్యాచారం చేసిన కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు తాజాగా శిక్షను ఖరారు చేసింది. గతంలో ట్రయల్ కోర్టు ఈయనను నిర్దోషిగా ప్రకటించింది. ఆ తీర్పును బాంబే హైకోర్టు రద్దు చేసింది. 2013లో గోవాలో జరిగిన ఒక కార్యక్రమంలో హోటల్ లిఫ్ట్‌లో తనపై తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబర్‌లో అతడిని అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం 2021లో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాలు చేసింది. అప్పీల్‌ను విచారించిన హైకోర్టు ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేస్తూ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. కాగా, ఈ కేసులో తానే బాధితుడినని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తాను నిర్దోషినని పేర్కొంటూ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని వెల్లడించారు. తీర్పు వెలువడిన అనంతరం మీడియాతో మాట్లాడిన తేజ్‌పాల్, 'నేను ఎలాంటి నేరమూ చేయలేదు. ఈ తీర్పుతో నేను ఏకీభవించడం లేదు. న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాను' అని చెప్పారు. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, సురేంద్ర గాడ్లింగ్ లాగానే తానూ రాజకీయ కక్షసాధింపునకు గురయ్యానని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తెహెల్కా చేసిన దర్యాప్తు కథనాల వల్ల కొందరి రాజకీయ ప్రయోజనాలకు నష్టం కలిగిందని, అందుకే తనపై కేసు పెట్టారని ఆయన ఆరోపించారు. కోర్టు తీర్పు అనంతరం తరుణ్ తేజ్‌పాల్ మీడియాతో మాట్లాడారు. తనపై కొందరు గత 13 ఏళ్లుగా ప్రతీకారంతో రగిలిపోతున్నారని అన్నారు. ఈ కేసులో తనను పదిసార్లు నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసే ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, దీనిపై త్వరలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తా మని తెలిపారు. ఈ సందర్భంగా ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్, భీమా కోరేగావ్ కేసులో అరెస్టైన సురేంద్ర గాడ్లింగ్ పేర్లను తేజ్‌పాల్ ప్రస్తావించారు. వారిలాగే తానూ రాజకీయ కక్షసాధింపునకు గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, విచారణ సందర్భంగా గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వాదనలు వినిపించారు. బాధితురాలు పలు మార్లు నిరాకరించినప్పటికీ తేజ్‌పాల్ వినలేదని, 'నో అంటే నో' అనే ప్రాథమిక సూత్రాన్నే ఆయన పట్టించుకోలేదని కోర్టుకు వివరించారు. నేర తీవ్రత దృష్ట్యా ఆయనకు గరిష్ఠ శిక్ష విధించాలని కోరారు. అయితే, తనకిప్పుడు 62 సంవత్సరాలని, తానూ బాధితుడినేనని నమ్ముతున్నానని కోర్టుకు తేజ్‌పాల్ విన్నవించారు. తనకు భార్య ఉందని, శిక్ష విషయంలో దయచేసి కనికరం చూపాలని కోరారు. విచారణ అనంతరం న్యాయస్థానం తనతీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది. తెహెల్కా ఎడిటర్–ఇన్–చీఫ్‌గా తేజ్‌పాల్ ఉన్న సమయంలో బాధితురాలు ఆయన కింద పని చేసిందని, వారి మధ్య అధికార అసమానత స్పష్టంగా ఉందని పేర్కొంది. ఆ వృత్తిపరమైన ఆధిపత్యాన్ని ఆయన దుర్వినియోగం చేశారని అభిప్రాయపడింది. ఈ సంద ర్భంగా బాధితురాలిపై జరిగిన అత్యాచారం నిజమేనని నిర్ధారిం చి తీర్పు వెలువరించింది. కాగా, గోవాలో 2013 నవంబర్ 7, 8 తేదీల్లో థింక్‌ఫెస్ట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తేజ్‌పాల్ తనపై రెండు సార్లు అత్యాచారం చేశాడని పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాదాపు 13 ఏళ్ల తర్వాత కోర్టు అతనిని దోషిగా తేల్చింది.

## తమిళనాట మరోమారు తమిళ్ తాయ్ వాళ్తు' వివాదం

### ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగందని పలువురు ఎంపి ఆరోపణ



చెన్నై,ఆగస్ట్6 : తమిళనాడులో రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాళ్తు' ఆలాపన ప్రొటోకాల్ మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది. తిరునెల్వేలిలో జరిగిన మనోన్మణీయం సుందరనార్ యూనివర్సిటీ 33వ స్నాతకోత్సవంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని ఎంపీలు ఆరోపించారు. కార్యక్రమంలో ముందుగా 'వందే మాతరం', అనంతరం జాతీయ గీతం, ఆ తర్వాత మూడో స్థానంలో 'తమిళ్ తాయ్ వాళ్తు' ఆలపించడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర గీతాన్ని ఈ విధంగా మూడో స్థానంలో ఉంచడం తమిళ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా.. ఆ గీత రచయిత సుందరనార్‌ను కూడా అవమానించడమేనని లేఖలో పేర్కొన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం, ఎంపీ కార్తి చిదంబరం, చిరుత్తైగల్ కచ్చి నేత తిరుమావలవన్‌తో పాటు మొత్తం 21 మంది ఎంపీలు గవర్నర్‌కు సంయుక్తంగా లేఖ రాశారు. గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం.. ప్రభుత్వ, విశ్వవిద్యాలయ కార్యక్రమాల్లో ప్రారంభంలో 'తమిళ్ తాయ్ వాళ్తు', ముగింపులో జాతీయ గీతం ఆలపించాలని వారు డిమాండ్ చేశారు. వరుసగా మూడోసారి ప్రొటోకాల్‌లో మార్పులు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావులేకుండా రాజ్‌భవన్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీలు విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- 22 మందిని బదిలీ చేస్తే ఉత్తర్వులు
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు
- రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్
- జెఎడిలో రిపోర్ట్ చేయాలని ఆమ్రపాలికి ఆదేశం




అమరావతి,ఆగస్ట్7 : ఏపీలో పలువురు ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం 20 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు ఐఎఫ్‌ఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్, ఏపీఎస్ ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం.శివప్రసాద్‌ను నియమించింది. టూరిజం, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎస్. రావత్, ఆర్కియాలజీ, మ్యూజియం విభాగం కమిషనర్‌గా రేవు ముత్యాలరాజును ప్రభుత్వం నియమించింది. పర్యాటక శాఖ బాధ్యతల్లో ఉన్న ఆమ్రపాలిని బదిలీ చేసి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టింది. మొత్తం 22 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్‌లను కేటాయించింది. పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం, హౌసింగ్, టీటీడీ, వీఎమ్ఆర్‌డీఏ, ఏపీ టూరిజం తదితర కీలక శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. రానున్న గోదావరి పుష్కరాల కోసం సురేశ్ కుమార్, భరత్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జయకృష్ణ, ఏపీఎస్‌ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్ నియమితులయ్యారు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆమ్రపాలిని రిలీవ్ చేసిన ప్రభుత్వం.. ఆమెను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అలాగే.. తేజ్ భరత్, బి.అనిల్ కుమార్ రెడ్డిలను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచించింది. పి.రవి సుభాష్‌కు ఏపీటీడీసీ ఎండీగా బాధ్యతలప్పగించింది. ఇక.. పురావస్తు శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజు, ఆరోగ్య శాఖ కమిషనర్‌గా చక్రధర్ బాబుకు అదనపు బాధ్యతలు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా అరుణ్ బాబు నియమితులయ్యారు. విశాఖ పట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కమిషనర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రభల గోపీనాథ్, ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పద్మావతి నియమితులయ్యారు. అదేవిధంగా హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా హెప్సిబా రాణి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బి.సునీల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. భారీ స్థాయి ఐఏఎస్ బదిలీలతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. పలు ముఖ్య శాఖలకు కొత్త అధికారులను నియమించడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో మరింత సమర్థవంతమైన పాలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# మండల ప్రజావాణిపై విస్తృత ప్రచారం చేయాలి

**–ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం..**
**– కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పని దినాల్లో మండల స్థాయిలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమంపై గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు.



కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించడం ద్వారా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. ఎంపీడీఓలు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన వినతులను జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు.

జలాశయాలు, చెరువులు, కుంటలు, వాగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల సమయంలో ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, లో-లెవెల్ కల్వర్టుల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల సమయంలో సమీప గ్రామాల ప్రజలు, రైతులు, పశువుల కాపరులు వెళ్లకుండా రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. లబ్ధిదారుల్లో అవగాహన పెంచి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.చేయూత పెన్షన్ల కోసం అవసరమైన ఆదాయ, నివాస, కుల తదితర ధ్రువీకరణ పత్రాలను అర్హులైన వారికి మాత్రమే జారీ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియను కూడా నిబంధనల మేరకు వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలి..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ చేనేత కళాకారులను ఘనంగా సన్మానించారు. .

ఈ సందర్భంగా బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. చేనేత మగ్గంపై కేవలం 170 నిమిషాల్లో చీరను నేసి విశేష గుర్తింపు పొందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్–రేఖ దంపతులతో పాటు సంప్రదాయ చేనేత వృత్తిని కొనసాగిస్తున్న గజ్జెల్లి యాదగిరి–రాజేశ్వరి దంపతులు, ప్రతి నూలు పౌర్ణమి రోజున మగ్గంపై వస్త్రం నేసే వెంగళ రవిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆలోచనల మేరకు నూతన చేనేత వస్త్రాలు అందించి ఘనంగా సత్కరించినట్లు తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి జౌళి శాఖ మంత్రి కేటీఆర్ చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాల పేర్లు మార్చడం తప్ప కొత్తగా కార్మికులకు ప్రయోజనం చేకూరే చర్యలు చేపట్టలేదని అన్నారు . ఎన్నికల హామీలను అమలు చేసి చేనేత కార్మికులకు సంవత్సరం పొడవునా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు, పద్మశాలి కుల బాంధవులు కలిసి ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. చేనేత వృత్తిని భావితరాలకు పరిచయం చేస్తూ కొనసాగిస్తున్న కళాకారులను సన్మానించడం అందరికీ గర్వకారణమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేనేత కార్మికుల కోసం ఆసరా పింఛన్లు, నేత బీమా వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వం అయినా కళాకారులను ప్రోత్సహిస్తూ ఆయా రంగాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శంకరయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పద్మశాలి సంఘ ప్రతినిధులు, చేనేత కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సౌదీ–పాక్–తుర్కియే మధ్య చారిత్రక రక్షణ ఒప్పందం

**ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా.. మూడింటిపై దాడిగానే పరిగణన**
**మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్‌పై మూడు దేశాల అధినేతల సంతకాలు**

బలగం టీవీ, హైదరాబాద్

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. భద్రతాపరమైన సవాళ్లను సమష్టిగా ఎదుర్కొనేందుకు సౌదీ అరేబియా, పాకిస్థాన్, తుర్కియేలు చేతులు కలిపాయి. ఈ మూడు దేశాలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పేరుతో చారిత్రక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.



శుక్రవారం సౌదీ అరేబియాలో జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్, తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వెల్లడైంది.

మూడింటిపై దాడిగానే పరిగణన

ఒప్పందంలోని కీలక నిబంధన ప్రకారం.. ఈ మూడు దేశాల్లో ఏ ఒక్క దేశంపై సాయుధ దాడి జరిగినా, దానిని మూడు దేశాలపై జరిగిన దాడిగానే పరిగణించి ఉమ్మడిగా స్పందించనున్నారు. సామూహిక నిరోధక శక్తిని బలోపేతం చేయడమే ఒప్పందం ప్రధాన లక్ష్యమని పాకిస్థాన్ విదేశాంగ శాఖ తెలిపింది.

ఈ ఒప్పందంతో మూడు దేశాల మధ్య రక్షణ రంగ సహకారం మరింత విస్తరించనుంది. ఉమ్మడి సైనిక విన్యాసాలు, రక్షణ దళాలకు ప్రత్యేక శిక్షణ, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, నిఘా సమాచార మార్పిడి వంటి అంశాలకు మార్గం సుగమం కానుంది.

సౌదీ భద్రతకు మరింత బలం

ఇటీవలి కాలంలో సౌదీ అరేబియాలోని కీలక మౌలిక సదుపాయాలు, చమురు క్షేత్రాలపై డ్రోన్లు, క్షిపణి దాడుల ముప్పు పెరిగింది. ఇరాన్, హూతీ రెబల్స్, ఇరాకీ మిలిటెంట్ వర్గాల నుంచి ఎదురవుతున్న భద్రతా సవాళ్ల నేపథ్యంలో రక్షణ భాగస్వామ్యాలను బలోపేతం చేసుకోవాలని సౌదీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

నాటోలో రెండో అతిపెద్ద సైనిక శక్తిగా ఉన్న తుర్కియే, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన పాకిస్థాన్‌తో రక్షణ భాగస్వామ్యం సౌదీకి వ్యూహాత్మకంగా కీలకంగా మారనుంది.

గతంలోనే సౌదీ–పాక్ రక్షణ ఒప్పందం

సౌదీ అరేబియా, పాకిస్థాన్‌లు గత సెప్టెంబర్‌లోనే వ్యూహాత్మక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. సౌదీలో 25 లక్షల మందికిపైగా పాకిస్థానీయులు నివసిస్తూ ఉపాధి పొందుతున్నారు. పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు సౌదీ అరేబియా నుంచి ఆర్థిక సహకారం కూడా అందుతోంది.

తాజా ఒప్పందంతో ఈ రెండు దేశాలకు తుర్కియే కూడా జత కావడంతో పశ్చిమాసియాలో కొత్త రక్షణ సమీకరణానికి తెరలేచినట్లయింది. మూడు దేశాల మధ్య భద్రత, రక్షణ సహకారం ద్వారా ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని ఒప్పందం పేర్కొంది.

# ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగుస్తుంది

**అణ్వాయుధం సాధించకుండా అడ్డుకోవడమే లక్ష్యం: ట్రంప్**
**హర్మూజ్ మార్గంపై చర్చలు.. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ప్రతిష్టంభన**



బలగం టీవీ, హైదరాబాద్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరిన నేపథ్యంలో ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక ఘర్షణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగిసే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఆంక్షలు, సైనిక ఒత్తిడి కారణంగా ఇరాన్ ఇక ఎక్కువకాలం ఈ పరిస్థితులను తట్టుకోలేదని పేర్కొన్నారు.

అమెరికా కాలమానం ప్రకారం గురువారం ఓవల్ ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

'అణ్వాయుధం ఉంటే ప్రపంచానికే ముప్పు'

ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉంటే పశ్చిమాసియాతో పాటు మొత్తం ప్రపంచానికే తీవ్ర ముప్పు ఏర్పడుతుందని ట్రంప్ అన్నారు. అందుకే అమెరికా ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు.

"నా అంచనా ప్రకారం యుద్ధం త్వరలోనే ముగుస్తుంది. ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితుల ఆధారంగా చెబుతున్నాను. ఇరాన్ ఇక ఎంతో కాలం ఈ రకమైన ఒత్తిడిని తట్టుకోలేదు."

హర్మూజ్ మార్గంపై చర్చలు

ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నెలకొన్న ప్రతిష్టంభనపైనా ట్రంప్ స్పందించారు. అక్కడ అమెరికా నౌకాదళం విధించిన దిగ్బంధనం సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.

ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో హర్మూజ్ మార్గాన్ని ప్రస్తుతం తాత్కాలికంగా తెరిచి ఉంచినట్లు తెలిపారు. అయితే అక్కడ భద్రతాపరమైన ముప్పులు ఇంకా ఉన్నాయని చెప్పారు. సముద్రంలో ఒక్క మైన్ ఉన్నా నౌకాయానం మొత్తం స్తంభించే ప్రమాదం ఉందని, కోట్ల డాలర్ల విలువైన నౌకలను నడిపేందుకు వ్యాపారులు భయపడుతున్నారని వివరించారు.

ఇరాన్‌తో జరుగుతున్న చర్చల్లో తాను స్వయంగా భాగస్వామినవుతున్నానని, త్వరలోనే సానుకూల ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

'అమెరికాకు తగిన సమాధానం ఇస్తాం'

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ సైనిక యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. అమెరికా ఆంక్షలు, బెదిరింపులకు తాము లొంగబోమని స్పష్టం చేసింది.

ఇరాన్ తాత్కాలిక రక్షణ మంత్రి బ్రిగేడియర్ జనరల్ సయ్యద్ మజిద్ ఇబ్న్ రెజా మాట్లాడుతూ.. తమ సాయుధ దళాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని తెలిపారు. అమెరికా లేదా ఇజ్రాయెల్ నుంచి ఎలాంటి బెదిరింపులు ఎదురైనా తీవ్రంగా తిప్పికొడతామని హెచ్చరించారు. శత్రు దేశాల సైనిక సామర్థ్యం క్రమంగా క్షీణిస్తోందని పేర్కొన్నారు.

చర్చలకు మరింత సమయం పడుతుంది: వాన్స్

ఇరాన్, అమెరికా మధ్య చర్చలు త్వరగా కొలిక్కి వచ్చే అవకాశం లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. ఇరాన్ నాయకత్వంలో ఉన్న అంతర్గత విభేదాల కారణంగా చర్చల ప్రక్రియ మరింత సంక్లిష్టంగా, సుదీర్ఘంగా సాగే అవకాశం ఉందని తెలిపారు.

అయినప్పటికీ సైనిక, ఆర్థిక, దౌత్య మార్గాలను సమర్థవంతంగా ఉపయోగించి ఇరాన్ అణ్వాయుధాన్ని సాధించకుండా అమెరికా అడ్డుకుంటుందని వాన్స్ స్పష్టం చేశారు.

'అమెరికా నాటకీయ దౌత్యం'

అమెరికా వైఖరిపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, చర్చల ప్రతినిధి మహమ్మద్ బాఘేర్ ఘలీబాఫ్ తీవ్ర విమర్శలు చేశారు. అమెరికా అనుసరిస్తున్నది 'నాటకీయ దౌత్యం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఒకవైపు భారీ దాడులకు దిగుతామని బెదిరిస్తూ.. మరోవైపు చర్చలకు సిద్ధమని ప్రకటించడం అమెరికా ఆడుతున్న నాటకమని విమర్శించారు. బెదిరింపులు, హామీలతో ఇరాన్‌పై ఒత్తిడి తీసుకురావడం సాధ్యం కాదని, అమెరికా వాస్తవ పరిస్థితులను గుర్తించాలని ఘలీబాఫ్ పేర్కొన్నారు.



# బీసీ స్టడీ సర్కిల్ శిక్షణతో ముగ్గురికి కోర్టు ఉద్యోగాలు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

బీసీ స్టడీ సర్కిల్ రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు ఇటివల విడుదల చేసిన కోర్టు ఉద్యోగ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన ముగ్గురు అభ్యర్థులు కొత్త కొండ కావ్య శ్రీ, లింగం పెల్లి మానస, గసికంటి ప్రత్యూష లు ఉద్యోగాలు సాధించిన సందర్భంగా వారిని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల. వెంకట స్వామి మరియు సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో బాధ్యతగా ఉండి ఇంతటితో ఆగి పోకుండా ఉన్నత ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉండాలని చెప్పారు. అదేవిధంగా జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్న గ్రూప్ 1,2,3,4, బ్యాంకింగ్,RRB,SSC, పోలీసు ఉద్యోగాలకు 125 రోజుల ఉచిత శిక్షణ ఫౌండేషన్ కోర్స్ ను, హైదరాబాద్ లో సివిల్స్ ఉచిత కోచింగ్ ను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో కోఆర్డినేటర్ హరీష్ ,సురేష్, కిరణ్మయి, దివ్య లు పాల్గొన్నారు.



# రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుకు ఉచితంగా షూ, టై, బెల్టుల పంపిణీ

బలగం టీవీ , వీర్నపల్లి

పేద విద్యార్థుల చదువుకు, ఉన్నతికి రాజేష్ ఫౌండేషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్ రాజేష్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 97 మంది విద్యార్థులకు ఉచితంగా షూ, టై మరియు బెల్టులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ... విద్యార్థులు ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ధీటుగా చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల గౌరవాన్ని, దేశ ప్రతిష్టను నిలబెట్టాలని కోరారు. విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడానికి తమ ఫౌండేషన్ తరపున ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పాఠశాల వాతావరణంలో క్రమశిక్షణతో మసలుకోవాలని పిల్లలకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్ సాగర్, గ్రామ సర్పంచ్ రాకేష్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, రిపోర్టర్ దీప్తి కుమార్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...



# థాయ్‌లాండ్‌లో స్కూల్‌లో కాల్పులు.. ఆరుగురు మృతి

**మృతుల్లో ముగ్గురు ఉపాధ్యాయులు, ముగ్గురు విద్యార్థులు.. 15 మందికి గాయాలు**

బలగం టీవీ బ్యాంకాక్,

థాయ్‌లాండ్‌లో ఘోర కాల్పుల ఘటన చోటుచేసుకుంది. బ్యాంకాక్‌కు వాయవ్యంగా ఉన్న నొంతబురి ప్రావిన్స్‌లోని డెబ్సిరిన్ నొంతబురి ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు ఉపాధ్యాయులు, ముగ్గురు విద్యార్థులు ఉన్నట్లు రాయల్ థాయ్ పోలీసులు తెలిపారు. మరో 15 మంది గాయపడగా.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు.

కాల్పుల అనంతరం నిందితుడి ఆత్మహత్యాయత్నం

కాల్పుల అనంతరం నిందితుడు తనపై తానే కాల్చుకున్నట్లు రాయల్ థాయ్ పోలీస్ ప్రతినిధి ట్రైరాంగ్ పివ్‌పాన్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు.

కుటుంబ సభ్యుల్లో ఒకరి నుంచి నిందితుడు తుపాకీ తీసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాల్పులకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు

పాఠశాలలో కాల్పులు జరిగినట్లు సమాచారం అందిన వెంటనే పోలీసులు, అత్యవసర వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పుల శబ్దం విన్న కొందరు విద్యార్థులు పోలీసులు వచ్చే వరకు ఓ గదిలో దాక్కున్నారని ప్రత్యక్ష సాక్షి వెల్లడించినట్లు సమాచారం.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని

ఘటనపై థాయ్‌లాండ్ ప్రధాని అనుటిన్ చార్న్‌విరాకుల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఫొటోలు, వీడియోలు పంచొద్దు

ఘటనపై విద్యాశాఖ మంత్రి ప్రసెర్ట్ చంతరారువాంగ్‌థాంగ్ కూడా విచారం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాల గోప్యతను దృష్టిలో ఉంచుకుని కాల్పులకు సంబంధించిన సున్నితమైన ఫొటోలు, వీడియోలు, సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని ప్రజలు, మీడియాను కోరారు.

అయితే ఘటన జరిగిన కొద్దిసేపటికే పాఠశాల వెలుపలి దృశ్యాలకు సంబంధించిన కొన్ని ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. పాఠశాల వెలుపల ప్రజలు ఆందోళనతో గుమిగూడగా, పోలీసులు, అత్యవసర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

గతంలోనూ పాఠశాలలో కాల్ప థాయ్‌లాండ్‌లో పాఠశాలల్లో కాల్పుల ఘటనలు గతంలోనూ చోటుచేసుకున్నాయి. ఈ



# నేతన్నలకు చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం..

**-చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది..**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించి, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం సిరిసిల్ల పట్టణంలో కోర్టు నుంచి పాత బస్టాండ్ వరకు నిర్వహించిన చేనేత ర్యాలీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఉన్న నేతన్న విగ్రహానికి ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.




ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో సిరిసిల్ల చేనేత, వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తోందన్నారు. నేతన్నలు, కార్మికులు, ఆసాములు, యజమానులకు సంవత్సరంలో కనీసం ఎనిమిది నెలల పాటు పని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.రూ.400 కోట్ల బకాయిల్లో రూ.350 కోట్లు చెల్లింపు

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో గత ఏడాది 6 కోట్ల 70 లక్షల మీటర్లకు పైగా ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 4 కోట్ల 50 లక్షల మీటర్ల ఆర్డర్లు ఇచ్చామని, త్వరలో మరో కోటి 50 లక్షల మీటర్లకు పైగా ఆర్డర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు .

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు, ఇతర వస్త్రాల తయారీ ద్వారా కూడా స్థానిక నేతన్నలకు పని కల్పిస్తున్నామని చెప్పారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు సంబంధించిన రూ.400 కోట్లకు పైగా బకాయిల్లో ఇప్పటికే రూ.350 కోట్లకు పైగా చెల్లించామని, మిగిలిన బకాయిలను కూడా త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు.నేతన్నల పొదుపును ప్రోత్సహించే త్రిఫ్ట్ పథకం ద్వారా ప్రభుత్వం సమానంగా సహకారం అందిస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. నేతన్న బీమా పథకం ద్వారా సిరిసిల్లలో ఇప్పటివరకు 129 మందికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులకు రూ.25 కోట్ల మేర రుణమాఫీ చేయడంతో పాటు లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేసినట్లు తెలిపారు .



పవర్‌లూమ్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, 25 హెచ్‌పీ వరకు పవర్‌లూమ్‌లకు యూనిట్‌కు రూ.2 సబ్సిడీ అమలు చేయడం వల్ల మూతపడిన అనేక పరిశ్రమలు తిరిగి ప్రారంభమయ్యాయని అన్నారు .సిరిసిల్ల చేనేత రంగాన్ని మరింత బలోపేతం

చేయడంతో పాటు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామనిఅన్నారు . రైతులు, నేతన్నలు సహా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డీఓ శ్రీధర్ బాబు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ సంతోష్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, చేనేత, వస్త్ర పరిశ్రమ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పనికి గడువు విధించి.. నిర్మాణాలు చేయాలి..

**– కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రతి దానికి గడువు విధించి.. నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం దేవాదాయ శాఖ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, ఎన్పీడీసీఎల్, నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్మికుల సంఖ్యను మరింత పెంచి.. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. రారాజేశ్వర ఆలయానికి చెందిన నూతన గోశాల పనులపురోగతిపై అడిగి తెలుసుకొని, అధికారులకు పలు సూచనలు చేశారు. గుడిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో మిగతా వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ తదితర అంశాలపై పర్యాటక శాఖ, వేములవాడ మున్సిపల్ శాఖ అధికారులకు సూచనలు చేశారు.బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 ఫీట్ల రహదారి విస్తరణ పనుల పురోగతిపై ఆరా తీశారు. రహదారి నిర్మాణం, ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణ తుది దశ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ టవర్ల నిర్మాణ పనులను త్వరితగతిన మొదలు పెట్టాలని సూచించారు. జిల్లా వైద్య కళాశాల, బాలుర, బాలికల హాస్టళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తుది దశ పనులను వేగంగా పూర్తి చేయించాలని సూచించారు. విద్యార్థులకు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే సిరిసిల్లలో కోర్టు



సముదాయ పనులు షెడ్యూల్ ప్రకారం చేయాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, ఆలయ ఈఈ రాజేష్, ఎన్ పీడీసీఎల్ ఈఈ వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వీటీఏడీఏ తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత



**కస్తూర్బా గురుకుల పాఠశాలలో తహసిల్దార్ ఆకస్మిక తనిఖీ**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ డి. సుజాత శుక్రవారం అల్మాస్పూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, వంట చేసే విధానం, వడ్డించే తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్, ఫ్రిడ్జ్‌లలో నిల్వ ఉంచిన కూరగాయలు మరియు ఇతర నిత్యావసర సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. కాలం చెల్లిన సరుకులు లేకుండా చూడాలని, తాజా కూరగాయలనే వినియోగించాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థులకు పోషకాలు ఉండేలా మెనూ ప్రకారం వంట చేయాలని, రోజూ పాలు, గుడ్లు తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. ఆహారంలో రుచితో పాటు పరిశుభ్రత కూడా ఉండాలని స్పష్టం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అజంత, వంట సిబ్బంది, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా 'శ్రీరామ హృదయం' నగర సంకీర్తన

ఎల్లారెడ్డిపేట బలగం టీవీ

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం "శ్రీరామ హృదయం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బిటుకూరి గోపాల ఆచార్యులు నగర సంకీర్తన నిర్వహించి అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీరామనామ సంకీర్తనలో పాల్గొన్నారు.

అపర రామానుజులు, పద్మభూషణులు, పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవం నవంబర్ 8న దీపావళి రోజున జరగనున్న నేపథ్యంలో లోకక్షేమార్థం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని పెద్దలు నిర్ణయించినట్లు తెలిపారు.

అందులో భాగంగా "సత్సంగము" కార్యక్రమాన్ని 29-07-2026 నుంచి 26-10-2026 వరకు 90 రోజులపాటు ఇంటింటా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ఆచార్యుల శ్రీసూక్తి వినడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

"శ్రీరామ హృదయం" కార్యక్రమం ద్వారా యాంత్రిక జీవితంలో మానవీయ విలువలు, ప్రేమ, ఆప్యాయత, సఖ్యత, గౌరవం, స్నేహభావం కుటుంబాల్లోనూ సమాజంలోనూ పెంపొందాలని నిర్వాహకులు




పేర్కొన్నారు. శ్రీరామచంద్రుడిని హృదయంలో నిలుపుకొని, ఆయన ఆదర్శాలను ఆచరించాలనే సందేశాన్ని భక్తులకు అందించారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, గోదా గోష్ఠి మహిళలు, భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి సరఫరాకు తాత్కాలిక బ్రేక్..

-అగ్రహారం 120 ఎంఎల్డీ ప్లాంట్‌లో నిర్వహణ పనులు.. రెండు రోజులు అంతరాయం

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

అగ్రహారం గ్రామంలోని 120 ఎంఎల్డీ నీటి శుద్ధి కేంద్రంలో సాధారణ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ప్లాంట్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం మధ్యాహ్నం 12 గంటల వరకు నీటి శుద్ధి కేంద్రం మూసివేయనున్నారు. దీంతో సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు, అలాగే సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి మున్సిపాలిటీల పరిధిలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది.నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి నీటి సరఫరాను యథావిధిగా పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు .నీటి సరఫరా నిలిచిపోయే సమయంలో ప్రజలు ముందస్తుగా తాగునీటి అవసరాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ అధికారులు సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# ఐటీఐ, ఏటిసి లో రెండో దశ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ఆగస్టు 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2026-27/28 విద్యా సంవత్సరానికి రెండో దశ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని,ఆగస్టు 6 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు

సిరిసిల్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్. కవిత శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్. కవిత మాట్లాడుతూ

ఒకటి, రెండేళ్ల వ్యవధి గల వివిధ ట్రేడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, కొత్త కుల ధ్రువీకరణ పత్రం, స్థానికత ధ్రువీకరణ, టీసీ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో సహా స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

అభ్యర్థులు https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అడ్మిషన్‌కు సంబంధించిన సమాచారం ఎస్ఎంఎస్‌ల ద్వారా అందించనున్నందున శాశ్వత మొబైల్ నంబర్‌ను నమోదు చేయాలని సూచించారు. ఒకే రిజిస్ట్రేషన్‌తో తెలంగాణలోని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేటు ఐటీఐలోనైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.సిరిసిల్ల ప్రభుత్వ ఐటీఐలో అందుబాటులో ఉన్న ట్రేడ్లు ఎలక్ట్రీషియన్,

ఫిట్టర్,మెకానిక్ (మోటార్ వెహికల్),మెకానిక్ (డీజిల్),కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్,

ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీమరియు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో కోర్సులు:

సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్,ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్,ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్,మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్,మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్,వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ లు కోర్సు లు అందుబాటులో ఉన్నాయని అన్నారు.

అభ్యర్థులకు కనీసం 14 సంవత్సరాలు నిండి ఉండాలని, మార్కులు, రిజర్వేషన్, స్థానికత, అభ్యర్థుల ఆప్షన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఐటీఐ కోర్సుల విద్యార్హతలు, సిలబస్ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.అర్హత కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు ఐటీఐలను సంప్రదించాలని సూచించారు.



# వెల్ది హరిప్రసాద్ నైపుణ్యం సిరిసిల్లకు గర్వకారణం

**–చేనేత కళకు కలెక్టర్ ప్రశంసలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని జ్యోతినగర్‌కు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ ప్రతిభ చేనేత రంగానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ హరిప్రసాద్ నివాసానికి వెళ్లి దంపతులను పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

హరిప్రసాద్ రూపొందించిన సూక్ష్మ మగ్గం, జీ-20 సదస్సు నేపథ్యాన్ని ప్రతిబింబించే వస్త్రం, వివిధ దేశాధినేతల చిత్రాలతో నేసిన ప్రత్యేక వస్త్రాలు, పీతాంబరం, అగ్గిపెట్టెలో పట్టే చీర, ఉంగరం, దబ్బనంలో ఇమిడే చేనేత వస్త్రాలను కలెక్టర్ ఆసక్తిగా పరిశీలించారు. వాటి తయారీ విధానం, ఒక్కో వస్త్రం పూర్తి చేయడానికి పట్టే సమయం, ముడి సరుకు, పెట్టుబడి వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హరిప్రసాద్ వినూత్న ఆవిష్కరణలు సిరిసిల్ల చేనేతకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని సృజనాత్మక ఉత్పత్తులు రూపొందించి సిరిసిల్ల ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. చీరలకు ఆకర్షణీయమైన ప్యాకింగ్ రూపొందించుకుంటే మార్కెట్‌లో మరింత ఆదరణ లభిస్తుందని సూచించారు.కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మొరాయించిన 108 అంబులెన్స్

ఎల్లారెడ్డిపేటలో సాంకేతిక లోపంతో నిలిచిపోయిన 108 అంబులెన్స్

అంబులెన్స్‌లోనే చిక్కుకున్న వృద్ధురాలు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పాత బస్టాండ్ వద్ద ఓ 108 అంబులెన్స్ సాంకేతిక లోపంతో ఒక్కసారిగా నిలిచిపోయింది. అంబులెన్స్‌లో ఉన్న వృద్ధురాలు కొంతసేపు అందులోనే చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే మరో అంబులెన్స్‌ను ఘటనాస్థలికి రప్పించి, రోగిని అందులోకి షిఫ్ట్ చేసి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాణాలను కాపాడాల్సిన అత్యవసర సేవల వాహనాలే మధ్యలో నిలిచిపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. జిల్లాలో నడుస్తున్న పాతబడ్డ 108 అంబులెన్స్‌లకు సరైన నిర్వహణ చేపట్టి, తరచూ సాంకేతిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర వైద్య సేవల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




# అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు – తృటిలో తప్పిన ప్రమాదం

బలగం టివి, ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి బుగ్గ సమీపంలో గురువారం రాత్రి ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు (బెలూన్లు) తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ప్రమాదానికి గురైన కారు కొనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన బిట్లా ప్రసాద్‌దిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.



## రిటైర్మెంట్‌లోనూ తగ్గని 'గాడ్' క్రేజ్!

అత్యధిక బ్రాండ్ వ్యాల్యూ కలిగిన రిటైర్డ్ భారత ప్లేయర్‌గా సచిన్ టెండూల్కర్ రికార్డ్

బలగం టీవీ, హైదరాబాద్

టీమిండియా దిగ్గజం, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. ఆట నుంచి తప్పుకుని 13 ఏళ్లు గడుస్తున్నా ఆయన ఇమేజ్, క్రేజ్ మాత్రం కొంచెం కూడా తగ్గలేదు. తాజాగా అత్యధిక బ్రాండ్ విలువ కలిగిన భారత రిటైర్డ్ క్రీడాకారుడిగా సచిన్ రికార్డు సృష్టించారు.

రూ.1200 కోట్లకు బ్రాండ్ విలువ: 'క్రోల్ ఇండియా సెలెబ్రిటీ బ్రాండ్ వాల్యుయేషన్-2025' తాజా నివేదిక ప్రకారం సచిన్ బ్రాండ్ విలువ దాదాపు రూ.1200 కోట్లుగా (140 మిలియన్ డాలర్లు) నమోదైంది. ప్రస్తుతం 53 ఏళ్ల వయస్సున్న సచిన్.. భారత టాప్-10 సెలబ్రిటీలలో అత్యధిక బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ఏకైక రిటైర్డ్ ప్లేయర్‌గా నిలిచారు. ప్రస్తుత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీలతో పోటీపడుతూ అనేక దిగ్గజ సంస్థలకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏజియస్ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో టైర్స్, స్పిన్నీ, టానిష్క్, ల్యూమినస్ పవర్, అన్‌అకాడమీ, హెఫెలె ఇండియా వంటి ప్రముఖ సంస్థలు సచిన్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగిస్తున్నాయి. అన్ని వయసుల వారిలో ఉన్న విశేష ప్రజాదరణే దీనికి ప్రధాన కారణమని క్రోల్ నివేదిక పేర్కొంది.

చరిత్రలో చెరగని రికార్డులు: సరిగ్గా 24 ఏళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగి 2013లో వీడ్కోలు పలికిన సచిన్.. టెస్టుల్లో 200 మ్యాచ్‌లలో 51 సెంచరీలతో 15,921 పరుగులు చేసి అత్యున్నత శిఖరాన నిలిచారు. కేవలం 300 ఇన్నింగ్స్‌ల్లోనే 15,000 పరుగుల మైలురాయిని అందుకున్న అత్యంత వేగవంతమైన బ్యాటర్‌గా నిలిచిన సచిన్ రికార్డు నేటికీ చెక్కుచెదరలేదు.

# శ్రీలంక 'ఎలెవన్'దే పైచేయి

భారత్‌పై తొలి రోజు ఆధిపత్యం.. 363/8తో ముగించిన ఆతిథ్య జట్టు

బలగం టీవీ, హైదరాబాద్

కొలంబో: శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు సన్నాహక మ్యాచ్‌లో భారత జట్టుకు తొలి రోజు ఆశించిన స్థాయిలో సాగలేదు. శ్రీలంక ఎలెవన్ బ్యాటర్లు అర్ధశతకాలతో రాణించడంతో మూడు రోజుల వార్మప్ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది.

నోండెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటర్లు భారత బౌలర్లపై పెద్దగా ఒత్తిడి లేకుండా పరుగులు రాబట్టారు. భారత్ తరఫున సుదీర్ఘ విరామం తర్వాత బౌలర్లు పోటీ క్రికెట్‌లోకి అడుగుపెట్టడంతో ఆచితూచి వ్యవహరించినట్లు కనిపించింది.

భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కుడి చేతి ఉంగరపు వేలికి గాయం కావడంతో ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో కేఎల్ రాహుల్‌పై అదనపు బాధ్యత పడింది.

తొలి సెషన్‌లో శ్రీలంక ఎలెవన్ 29 ఓవర్లలో ఒక వికెట్‌కు 138 పరుగులు చేసింది. నిషాన్ ఫెర్నాండో 65 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్‌తో 66 పరుగులు చేశాడు. అనంతరం రవీందు రసంత 143 బంతుల్లో 71 పరుగులతో ఆకట్టుకున్నాడు. పసిందు సూరియబండార 35 పరుగులు చేశాడు.

స్పిన్నర్లదే హవా

భారత స్పిన్నర్లు చివర్లో పుంజుకుని ఆరు వికెట్లు పడగొట్టారు. సుతార్ 13 ఓవర్లలో 33 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించి అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. రసంత వికెట్‌ను సుతార్ అద్భుతంగా సాధించాడు. కుల్దీప్ యాదవ్ 18 ఓవర్లు వేసి రెండు వికెట్లు పడగొట్టాడు. అహాన్ విక్రమసింఘే, అంజలా బండార అతని బౌలింగ్‌లో ఔటయ్యారు.

రవీంద్ర జడేజా కూడా రెండు వికెట్లు తీశాడు. రమేశ్ మెండిస్‌ను ఫస్ట్ స్లిప్‌లో దేవదత్ పడిక్కల్ అద్భుత క్యాచ్‌తో పెవిలియన్‌కు పంపించాడు. శ్రీలంక ఎలెవన్ కెప్టెన్ సోనల్ దినూష 52 పరుగులు చేసి సుతార్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు.




భారత పేసర్లలో మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ 21 ఓవర్లు వేసినా ఒక్క వికెట్ కూడా దక్కలేదు. సిరాజ్ 13 ఓవర్లలో 44 పరుగులిచ్చాడు. మరోవైపు గుర్నూర్ బ్రార్ 12 ఓవర్లలో 49 పరుగులిచ్చి ఒక వికెట్ సాధించాడు. సారాంశ్ జైన్ 11 ఓవర్లలో 54 పరుగులు ఇచ్చాడు.

తొలి రోజు భారత బౌలింగ్‌లో పెద్దగా దూకుడు కనిపించకపోవడంతో శ్రీలంక బ్యాటర్లు సులభంగా క్రీజులో కుదురుకున్నారు. వార్మప్ మ్యాచ్ కావడంతో భారత్ గిల్ గాయం నేపథ్యంలో బౌలర్లపై అధిక భారం మోపకుండా జాగ్రత్త వహించినట్లు కనిపించింది. అయితే అసలు టెస్టు సిరీస్‌కు ముందు ఇలాంటి మ్యాచ్‌ల్లోనే కొత్త బౌలర్లను పరీక్షించడం, దూకుడైన వ్యూహాలను అమలు చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఆసియా గేమ్స్‌కు విన్నర్స్ మైండ్‌సెట్ సాధిస్తున్న ఆర్చర్ సాహిల్ యాదవ్

కోల్‌కతా (పీటీఐ):

మొబైల్ ఫోన్ల అతిగా వాడే అలవాటు (స్క్రోలింగ్) తగ్గించుకోవడానికి పుస్తక పఠనాన్ని ఆశ్రయించిన భారత యువ ఆర్చర్ సాహిల్ యాదవ్, ఇప్పుడు అదే అలవాటుతో ఒత్తిడిని అధిగమించే మార్గాన్ని కనుగొన్నాడు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ రాసిన స్వీయ సహాయక పుస్తకం 'ది విన్నర్స్ మైండ్‌సెట్' తన మానసిక దృఢత్వాన్ని ఎంతగానో పెంచిందని 25 ఏళ్ల ఈ విలుకాడు పేర్కొన్నాడు. జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా సెప్టెంబర్-అక్టోబర్‌లో జరగనున్న ఆసియా క్రీడలకు సిద్ధమవుతున్న వేళ ఈ పుస్తకం తనలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపిందని తెలిపాడు.

ఒత్తిడి నిర్మూలనకు వాట్సన్ సూత్రాలు:

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) మీడియా సంభాషణలో సాహిల్ మాట్లాడుతూ — "నెల రోజుల క్రితం షేన్ వాట్సన్ 'ది విన్నర్స్ మైండ్‌సెట్' పుస్తకం చదవడం ప్రారంభించాను. ఫోన్ స్క్రీన్ టైమ్ తగ్గించుకోవడమే నా ప్రాథమిక లక్ష్యం. కానీ, ఇందులో ఉన్న మానసిక వ్యూహాలు పెద్ద టోర్నీల్లో ఒత్తిడిని ఎలా జయించాలి, సుదీర్ఘ పోటీలలో దృష్టి కేంద్రీకరించడం ఎలా అనే అంశాలపై నాకు ఎంతో ఉపయోగపడ్డాయి" అని వివరించాడు. ఈ పుస్తకంలో వాట్సన్ మైదానంలో తనకు ఎదురైన అనుభవాలను ఉదహరిస్తూ ఆందోళన, ఒత్తిడిని దూరం చేసుకునే సహజ సిద్ధమైన మానసిక సూత్రాలను పొందుపరిచారు.

ఏడేళ్ల ఎదురుచూపుల తర్వాత తొలి పతకం:

మహారాష్ట్రలోని సతారాకు చెందిన సాహిల్, 19 ఏళ్ల వయస్సులో ఆలస్యంగా ఆర్చరీ రంగానికి వచ్చాడు. జాతీయ స్థాయిలో తొలి పతకం సాధించడానికి అతనికి ఏడేళ్ల సమయం పట్టింది.

2024లో: తొలిసారిగా జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించాడు.

వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్: వ్యక్తిగత విభాగంలో పసిడి, టీమ్ విభాగంలో రజత పతకం సొంతం చేసుకున్నాడు.

ఆసియా గేమ్స్ ముంగిట: ఇటీవల షాంఘైలో జరిగిన ఆర్చరీ ప్రపంచకప్ 2026 స్టేజ్-2 పురుషుల కాంపౌండ్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నాడు.

చిన్న పొరపాట్లే కొంపముంచుతున్నాయి:

ఆసియా ఖండంలో పటిష్టమైన దక్షిణ కొరియా, చైనా, జపాన్ వంటి జట్లను ఢీకొట్టేందుకు భారత జట్టు సిద్ధంగా ఉందన్నారు. "ప్రపంచంలోనే అత్యంత కఠినమైన సెలక్షన్ ట్రయల్స్‌ను దాటుకుని మేము భారత జట్టులోకి వచ్చాం. అంటే ప్రపంచంలోనే అత్యుత్తమ ఆర్చర్లను ఓడించే సత్తా మాకుంది. అయితే కీలక సమయాల్లో ఒత్తిడికి గురై 1 లేదా 2 పాయింట్ల తేడాతో మూల్యం చెల్లించుకుంటున్నాం. ఇటువంటి చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకుంటే ఆసియా గేమ్స్‌లో భారత్‌కు పతకాలు ఖాయం" అని ధీమా వ్యక్తం చేశాడు.

ప్రస్తుతం కోల్‌కతాలోని SAI నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్న సాహిల్, తన క్రీడా ప్రయాణంలో కుటుంబ త్యాగాలు మరియు SAI అందిస్తున్న సౌకర్యాలు ఎంతో కీలక పాత్ర పోషించాయని వెల్లడించాడు.

# గ్రాండ్ చెస్ టూర్‌లో ప్రజ్ఞానంద సంచలనం

### సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్ కైవసం.. 50 వేల డాలర్ల నగదు బహుమతి

బలగం టీవీ, హైదరాబాద్

సెయింట్ లూయిస్: భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద గ్రాండ్ చెస్ టూర్ (జీసీటీ సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చెస్ 2026 టోర్నీలో విజేతగా నిలిచాడు. ఐదు రోజుల పాట జరిగిన ఈ పోటీల ఫైనల్‌లో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన గ్రాండ్‌మాస్టర్ జవోఖిర్ సిందరోవ్ గట్టి పోటీనిచ్చినా. 1.5 పాయింట్ల ఆధిక్యంతో ప్రజ్ఞానంద టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. మరో రౌండ్ మిగిలి ఉండగానే అతడి విజయం ఖరారైంది.

టైటిల్ గెలిచిన ప్రజ్ఞానందకు 50 వేల డాలర్ల నగదు బహుమతితో పాటు 13 జీసీటీ పాయింట్ల లభించాయి. దీంతో 2026 సీజన్ స్టాండింగ్స్‌లో అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానా తర్వాత ప్రజ్ఞానంద రెండో స్థానంలో నిలిచాడు.

వరుస విజయాలతో దూసుకెళ్తున్న ప్రజ్ఞానంద

ప్రజ్ఞానందకు ఈ ఏడాది ఇది మరో ప్రతిష్ఠాత్మక విజయం. జూన్‌లో జరిగిన నార్వే చెస్ టోర్నీలోను అతడు విజేతగా నిలిచాడు. ఫైనల్లో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించాడు. ఈ టోర్నీలో ఏడుసార్ల నార్వే చెస్ చాంపియన్‌గా నిలిచిన మాగ్నస్ కార్ల్‌సన్‌ను ప్రజ్ఞానంద రెండుసార్లు ఓడించడం విశేషం.

నార్వే చెస్ టైటిల్ సాధించిన సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి ప్రజ్ఞానందను సన్మానించి రూ.50 లక్షల నగదు బహుమతి అందజేశారు. తాజాగా జీసీటీ సెయింట్ లూయిస్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకోవడంతో భారత యువ గ్రాండ్‌మాస్టర్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది.

ఆగస్టు 10 నుంచి సింక్విఫీల్డ్ కప్

ఆగస్టు 10న ప్రారంభమయ్యే **'సింక్విఫీల్డ్ కప్'**తో ఈ ఏడాది గ్రాండ్ చెస్ టూర్ సీజన్ ముగియనుంది. సెయింట్ లూయిస్ టోర్నీలో పాల్గొన్న ప్రజ్ఞానందతో పాటు ఇతర ప్రముఖ చెస్ క్రీడాకారుల ఈ పోటీలోనూ తలపడనున్నారు.



# నీరజ్‌ను విమర్శించడం సరికాదు

**గాయం తర్వాత రజతం సాధించడం గొప్ప విషయమే**

**— ఏఎఫ్ఐ ఎంపిక కమిటీ చైర్మన్ ఆదిల్ సుమరివాలా**

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లాస్గో వేదికగా జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపై వస్తున్న విమర్శలను అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) ఎంపిక కమిటీ చైర్మన్ ఆదిల్ సుమరివాలా ఖండించారు. నీరజ్ ఇప్పటికీ భారత్ అత్యుత్తమ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లలో ఒకడని ఆయన పేర్కొన్నారు.

కామన్వెల్త్ క్రీడలకు ముందు నీరజ్ గాయంతో బాధపడ్డాడని, నెలల తరబడి పునరావాస చికిత్స అనంతరం బరిలోకి దిగి రజత పతకం సాధించడం గొప్ప విజయమని సుమరివాలా అన్నారు. గాయం నుంచి కోలుకుని ఈ స్థాయికి తిరిగి రావడం భారత అథ్లెటిక్స్‌కు ఎంతో సానుకూల పరిణామమని తెలిపారు.

అతనూ మనిషే కదా!

నీరజ్ ప్రతిసారీ స్వర్ణ పతకమే సాధించాలనే అంచనాలు పెట్టుకోవడం సరికాదని సుమరివాలా అన్నారు. ఏ క్రీడాకారుడూ ఎప్పటికీ అజేయంగా ఉండలేడని పేర్కొన్నారు.

"నీరజ్ ప్రతిసారీ స్వర్ణ పతకాలు గెలవకపోవచ్చు. అప్పుడప్పుడు రజత పతకాలు కూడా వస్తాయి. అతనూ మనిషే. రజతం సాధించిన విజయాన్ని కూడా మనం సెలబ్రేట్ చేసుకోవాలి. అతడిని తక్కువగా అంచనా వేయకూడదు."

నీరజ్ భారత్‌కు ఎన్నో ప్రతిష్ఠాత్మక విజయాలు అందించాడని గుర్తుచేశారు. రెండు ఒలింపిక్ పతకాలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, ఆసియా క్రీడల్లో పసిడి, కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణంతో పాటు తాజాగా రజతం వంటి ఎన్నో ఘనతలు అతని ఖాతాలో ఉన్నాయని తెలిపారు. నీరజ్ సాధించే ప్రతి పతకాన్ని అదనపు విజయంగా భావించి గౌరవించాలని సూచించారు.

జావెలిన్ త్రోలో భారత్‌కు రెండు పతకాలు

గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ చోప్రా రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. భారీ అంచనాలతో బరిలోకి దిగిన అతడిని శ్రీలంకకు చెందిన రుమేశ్ పతిరాగే అధిగమించి స్వర్ణ పతకం సాధించాడు. నీరజ్ కంటే సుమారు మూడున్నర మీటర్ల దూరం ఎక్కువగా ఈటెను విసరడంతో రుమేశ్ అగ్రస్థానంలో నిలిచాడు.

ఇదే పోటీలో భారత అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకం సాధించాడు. దీంతో జావెలిన్ త్రోలో భారత్‌కు స్వర్ణం దక్కకపోయినా రజతం, కాంస్యం రూపంలో రెండు పతకాలు లభించాయి.





## అశ్విన్ జీవితాన్ని మార్చిన మంజ్రేకర్ విమర్శలు

బలగం టీవీ, హైదరాబాద్

టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన కెరీర్‌లో ఎదురైన ఓ విమర్శ తన జీవితాన్నే మార్చేసిందని వెల్లడించాడు. మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ 2012లో తన తొలి ఆస్ట్రేలియా పర్యటన అనంతరం రాసిన కథనం తనపై తీవ్ర ప్రభావం చూపిందని చెప్పాడు.

ఆస్ట్రేలియా పర్యటనలో అశ్విన్ బౌలింగ్‌ను ప్రశంసించిన మంజ్రేకర్.. అతడి ఫిట్‌నెస్‌పై మాత్రం విమర్శలు చేశాడు. ఫిట్‌నెస్ లోపం భవిష్యత్తులో బౌలింగ్, ఫీల్డింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నాడు.

'తీవ్రంగా బాధపడ్డా'

తాజాగా జియోస్టార్ నిర్వహించిన 'చీకీ సింగిల్స్' కార్యక్రమంలో అశ్విన్ మాట్లాడుతూ.. ''నా తొలి ఆస్ట్రేలియా పర్యటన తర్వాత మంజ్రేకర్ నా ప్రదర్శనపై ఒక ఆర్టికల్ రాశారు. తిరిగి వస్తున్న సమయంలో దాన్ని పూర్తిగా చదివాను. అది చదివిన తర్వాత తీవ్రంగా కోపం వచ్చింది. అంతకంటే ఎక్కువగా బాధపడ్డాను. అయితే ఆ విషయాన్ని అక్కడితో వదిలేశాను'' అని గుర్తుచేసుకున్నాడు.

''నేను అప్పట్లో గొప్ప అథ్లెట్‌ను కాదు. అందుకే ఆ తర్వాత నాలుగేళ్లు ఫిట్‌నెస్‌పై చాలా కష్టపడ్డాను. 2015లో మంజ్రేకర్ నా బౌలింగ్‌ను ప్రశంసిస్తూ మరో ఆర్టికల్ రాశారు. అప్పుడు ఆయన నంబర్ తీసుకుని స్వయంగా సందేశం పంపించాను. 'మీ ఆర్టికల్ నా జీవితాన్ని మార్చేసింది' అని చెప్పాను'' అని అశ్విన్ వెల్లడించాడు.

కెరీర్‌లో విమర్శలు చేసిన వ్యాఖ్యాతలపై అప్పట్లో తాను ఆగ్రహం వ్యక్తం చేసేవాడినని, అయితే రిటైర్మెంట్ తర్వాత వారి అభిప్రాయాలను మరో కోణంలో చూడగలిగానని అశ్విన్ తెలిపాడు. వారు తమ వృత్తిలో భాగంగానే వ్యాఖ్యలు చేశారని అర్థం చేసుకున్నానని పేర్కొన్నాడు.

హర్భజన్‌కు వీరాభిమాని

తాను భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్‌కు వీరాభిమానినని అశ్విన్ చెప్పాడు. కెరీర్ ప్రారంభంలో హర్భజన్ బౌలింగ్ యాక్షన్‌ను అనుకరించేవాడినని తెలిపాడు.

''అండర్-19 క్రికెట్‌లో దినేశ్ కార్తీక్ కెప్టెన్సీలో ఆడాను. ఆ సమయంలో హర్భజన్ బౌలింగ్ యాక్షన్‌ను అనుకరించేవాడిని. అప్పట్లో నేను బ్యాటింగ్ చేసేవాడిని కాబట్టి ఎక్కువగా బౌలింగ్ చేసే అవకాశం వచ్చేది కాదు. బౌలింగ్ చేసిన ప్రతిసారీ హర్భజన్‌ను అనుకరించేవాడిని. ఆయనకు నేను డైహార్డ్ ఫ్యాన్‌ను. ఆయన తీసిన తొలి అంతర్జాతీయ వికెట్ కూడా నాకు గుర్తుంది. గల్లీ క్రికెట్‌లో ప్రతిరోజూ ఆయన యాక్షన్‌ను అనుకరించేవాడిని. ఆయన మ్యాచ్‌లన్నీ చూసేవాడిని'' అని అశ్విన్ చెప్పాడు.

# వరుసగా రెండోసారి అలన్ బోర్డర్ మెడల్ గెలిచిన ట్రావిస్ హెడ్

అరుదైన ఘనత సాధించిన ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్

బ్రిస్బేన్, ఆగస్టు 7: ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ అరుదైన ఘనత సాధించాడు. వరుసగా రెండోసారి ప్రతిష్ఠాత్మక అలన్ బోర్డర్ మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. శుక్రవారం బ్రిస్బేన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఆస్ట్రేలియా కెప్టెన్ అలన్ బోర్డర్ చేతుల మీదుగా హెడ్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు.

ఆస్ట్రేలియా పురుషుల క్రికెట్‌లో వరుసగా రెండుసార్లు ఈ అవార్డు గెలిచిన ఐదో ఆటగాడిగా హెడ్ నిలిచాడు. గతేడాది కూడా అతడే ఈ పురస్కారాన్ని అందుకున్నాడు.

ఒక్క ఓటుతో విజయం

2025 జనవరి 29 నుంచి 2026 జనవరి 8 వరకు జరిగిన ఓటింగ్‌లో హెడ్ తన సన్నిహిత మిత్రుడు అలెక్స్ క్యారీపై కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించాడు. మిచెల్ స్టార్క్ కంటే మూడు ఓట్ల ఆధిక్యంతో అగ్రస్థానంలో నిలిచాడు.

ఈ సందర్భంగా హెడ్ మాట్లాడుతూ అలన్ బోర్డర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నాడు. తన పిల్లలు భవిష్యత్తులో ఈ రెండు పతకాలను చూసి గర్వపడతారని, 20 ఏళ్ల తర్వాత వారికి వాటి గురించి చెప్పుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుందని అన్నాడు.



యాషెస్‌లో అదరగొట్టిన హెడ్

ఓటింగ్ కాలంలో టెస్టుల్లో ఆస్ట్రేలియా తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా హెడ్ నిలిచాడు. వన్డేల్లోనూ జట్టులో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా రాణించాడు.

యాషెస్ సిరీస్‌లో సిడ్నీ వేదికగా జరిగిన నూతన సంవత్సర టెస్టులో హెడ్ 163 పరుగులు సాధించాడు. ఈ సిరీస్‌లో అతడు మూడు శతకాలు బాదడం విశేషం. పెర్త్‌లో 123, అడిలైడ్‌లో 170 పరుగులు కూడా అతని అత్యుత్తమ ప్రదర్శనల్లో ఉన్నాయి. దక్షిణాఫ్రికాతో మాకే వేదికగా జరిగిన వన్డేలో 142 పరుగులు చేశాడు.

స్టార్క్‌కు షేన్ వార్న్ అవార్డు

మిచెల్ స్టార్క్‌కు షేన్ వార్న్ పురుషుల టెస్టు ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం లభించింది. యాషెస్‌లో 31 వికెట్లు పడగొట్టడంతో పాటు జమైకాలో పింక్ డ్యూక్స్ బంతితో 6/9 గణాంకాలు నమోదు చేయడం అతని అవార్డు ఎంపికలో కీలకంగా మారింది.

మిచెల్ మార్ష్ వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్, టిమ్ డేవిడ్ టీ20 అంతర్జాతీయ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాలు అందుకున్నారు.

వరుసగా రెండుసార్లు అలన్ బోర్డర్ మెడల్ గెలిచిన ఆటగాళ్ల జాబితాలో హెడ్ చేరాడు. ఇంతకుముందు రికీ పాంటింగ్, మైఖేల్ క్లార్క్, డేవిడ్ వార్నర్, షేన్ వాట్సన్ ఈ ఘనత సాధించారు.

# 'కొరియన్ కనకరాజు'కు అదిరిపోయే ఆరంభం

వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడుదలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళతోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివే శాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నా యని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల నుంచి గట్టి పోటీ లేకపోవడం కూడా 'కొరియన్ కనకరాజు'కు కలిసొచ్చే అంశంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సానుకూల పరిస్థితుల్లో తొలి వారాంతంలో సినిమా భారీ వసూళ్లను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా మంచి బజ్, పాజిటివ్ టాక్‌తో మొదలైన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు చాలా కాలంగా ఎదురుచూస్తున్న విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి.




# CINEMA

## విడుదలైన 'ది ప్యారడైజ్' టీజర్



టాలీవుడ్ హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్ విడుదలైంది. షూటింగ్ చివరి దశకు చేరుకున్న వేళ వచ్చిన ఈ టీజర్ సోషల్ మీడియాలో మంచి స్పందన అందుకుంటోంది. టీజర్‌లో నాని ఇప్పటివరకు కనిపించని మాస్ లుక్‌లో కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. చేతి నిండా బ్లేడ్లు పట్టుకుని కనిపించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'దిష్టంతా పోవాలే' అంటూ నాని చెప్పిన డైలాగ్ అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది. టీజర్‌కు అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం మరో హైలెట్‌గా నిలిచింది. ప్రతి యాక్షన్ సీన్‌కు తగ్గట్టుగా వచ్చిన బీజీఎం టీజర్‌కు మరింత బలం తీసుకొచ్చింది. విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాలో నాని సరసన కాయాదు లోహార్ కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌కు వస్తున్న స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'ది ప్యారడైజ్' వచ్చే నెల 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అమ్మాయిలు ఇండస్ట్రీకి రావొద్దు



సినీ రంగుల ప్రపంచంలో వెలుగొందాలని.. డబ్బు, పేరు సంపాదించాలని ఎన్నో కలలతో హైదరాబాద్, చెన్నై, ముంబై రైళ్లు ఎక్కేస్తారు యువతీ, యువకులు. అయితే ఇక్కడికి వచ్చాక కానీ ఇండస్ట్రీ లోతు ఎంతో తెలియదు. ప్రతిభ ఉన్నప్పటికీ ఎన్నో అడ్డంకులు, అవరోధాలు, వెనక్కి లాగే వాళ్లను దాటుకుని అవకాశాలు రాబట్టడం అంత సులభం కాదు. ఇక అమ్మాయిలను అవకాశాల పేరుతో ట్రాప్ చేసే క్యాస్టింగ్ కౌచ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో చీకటి కోణాలను ఎందరో నటీనటులు బయటపెట్టారు.కొన్నేళ్ల క్రితం చెలరేగిన మీటూ ఉద్యమం భారతీయ చిత్ర పరిశ్రమను ఒక కుదుపు కుదిపింది. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఎందరో పెద్ద మనుషుల బాగోతాలు బయటపడ్డాయి. ఇండస్ట్రీలో ఆడవాళ్లకు అవకాశాలు రావాలంటే కమిట్మెంట్ ఇవ్వాల్సిందేనని వర్ధమాన నటీమణులతో పాటు స్టార్ హీరోయిన్లు కూడా చెప్పుకొచ్చారు. తాజాగా సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్ గురించి ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సంచలన వ్యాఖ్యలు చేసింది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ వివరాల్లోకి వెళితే.ఎవరైనా మన ఇన్‌స్టాగ్రామ్ కానీ, యూట్యూబ్ కానీ చూసి మీకు సినిమాలలో ఆఫర్లు ఇస్తాము, ఫోక్ సాంగ్‌లో ఆఫర్ ఇస్తాము, షార్ట్ ఫిల్మ్స్‌లో ఆఫర్ ఇస్తాము, సీరియల్స్‌లో ఆఫర్ ఇస్తాము అంటే నమ్మి ఎగేసుకుని నాలాగా మాత్రం రాకండి. ఎందుకంటే ప్రతివాడు కమిట్‌మెంట్ లేనిదే ఏ ఒక్కడు కూడా ఏ ఒక్క దానికి అవకాశం ఇవ్వడు అని పక్కా ప్రూవ్ అయ్యింది. నాకు ఒకసారి కాదు ఇది మూడోసారి. నాకు సిగ్గు లేదు.. ఫస్ట్ సీరియల్ కోసం పిలిస్తే అలాగే వెళ్లాను, అక్కడ కూడా ఇదే పంచాయతీ ఉంటే రిటర్న్ వచ్చేశాను. అలాగే సినిమాలో ఆఫర్ వస్తే వెళ్లాను.. సినిమాకి కూడా అదే రిపీట్ అయ్యింది. మళ్లీ రిటర్న్ వచ్చాను. ఇప్పుడు ఫోక్ సాంగ్ కోసమని ఒకడు పిలిచాడు. సరే కవర్ సాంగ్స్ అయినా చేద్దామని ఒప్పుకుని ఇక్కడికి వస్తే .. వాడు ఉదయం నుంచి కూర్చోబెట్టి, మగాడి బుద్ధి ఏంటనేది చూపించాడు. ప్రతివాడు చూసేది అవకాశం ఇస్తాడు, ఇవ్వడనేది కాదు అని ఆ అమ్మాయి చెప్పింది. ఖచ్చితంగా అమ్మాయిలకు 100కి 110 శాతం అవకాశాలు ఉన్నాయి. ఒక మగాడి పక్కన ఆడది పడుకుంటేనే అవకాశాలు ఇచ్చే పరిస్థితి ఉంది హైదరాబాద్‌లో. దయచేసి ఎవరూ గుడ్డిగా నమ్మి రాకండి, నన్ను తప్పుగా అనుకున్నా పర్లేదు. ఒక అమ్మాయి సినీ ఫీల్డ్‌లో సెటిల్ అయ్యిందంటే ఖచ్చితంగా ఒకడి దగ్గర పడుకునే సెటిలైందని పక్కగా నమ్మి చెబుతున్నా. ప్రతి ఒక్కడు ఆడదానిని వాడుకోవాలనే చూస్తాడు.. నాకు తెలిసి ఏ ఒక్క అమ్మాయి కూడా టాలెంట్‌తో ఎదిగిందంటే నేను ఒప్పుకోను. ప్రతివాడు లొంగదీసుకున్నవాడే.. ఎవడో ఒకడి దగ్గర పడుకునే పైకొచ్చింది. లేదంటే మాత్రం ఒక అమ్మాయికి ఆఫర్ రావాలంటే మాత్రం చాలా చాలా కష్టం. నా మీద ఎన్ని నెగిటివ్ కామెంట్స్ పెట్టినా ఓకే.. నా బాధ మీతో పంచుకుంటున్నాను అని ఆ యువతి వాపోయింది.

# 'వారణాసి' వీడియో లీక్..

దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న వారణాసి సినిమాకు లీకులు బెడద ఎక్కువగానే ఉంటున్నది. ఈ సినిమా కోసం భారీ సెట్స్ వేసి.. పకడ్బందీగా సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పటికీ.. ఈ సినిమా కోసం షూట్ చేస్తున్న కీలక సన్నివేశాలను కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టు చేసి లీక్ చేస్తున్నారు. ఈ లీకుల బెడదతో చిత్ర యూనిట్ ఆందోళనకు గురి అవుతున్నట్టు సమాచారం. గతంలో కూడా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఫోటోలు, వీడియోలు మీడియాలో లీక్ అయ్యాయి. అయితే తాజాగా 20 సెకన్ల నిడివి ఉన్న ఓ సన్నివేశాన్ని







కొందరు లీక్ చేయడంతో ఆ విషయం సోషల్ మీడియాలో ట్రెండింగ్గా మారింది. దర్శకుడు రాజమౌళి తన సినిమా షూటింగ్ స్పాట్‌ను అన్ని రకాలుగా దిగ్బంధం చేస్తారు. లోపలి విషయాలు బయటకు పొక్కకుండా సాంకేతికంగా చాలా జాగ్రత్తలు తీసుకొంటారు. సినిమా కోసం పనిచేసే ప్రతీ ఒక్కరి నుంచి లీక్‌లు చేయకుండా అగ్రిమెంట్స్ రాయించుకొంటారు. ఎదైనా విషయాన్ని బయటకు లీక్ చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడమనే పాయింట్‌తో కూడిన అగ్రిమెంట్‌పై సంతకాలు కూడా చేయించుకొంటారు. అయినా ఆయన షూటింగ్‌లకు సంబంధించిన లీకుల బెడద తప్పకపోవడం ఆందోళనకరంగా మారింది. వారణాసి సినిమా షూటింగును ఒడిశాలోని ఓ మారుమూల ప్రాంతంలో చిత్రీకరించారు. అయితే కెమెరాకు అందని దూరంలో ఉన్న సన్నివేశాలను షూట్ చేసి వాటిని కొందరు లీక్ చేశారు. ఇక ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ సమయంలో రామోజీ ఫిలిం సిటీలో పకడ్బందీగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి దొంగచాటుగా షూట్ చేసి లీక్ చేశారు. గ్లింప్స్‌ను అధికారికంగా రిలీజ్ చేయడానికి ముందే అది సోషల్ మీడియాలో విడుదల కావడం షాకిచ్చింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన 20 సెకన్ల వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నదనే సమాచారం మరోసారి భారీ షాక్‌కు గురి చేసింది. కొందరు ఈ క్లిప్పింగ్ గురించి సోషల్ మీడియాలో మాట్లాడుతూ.. రక్తంతో రాసిన కథ. దానిని సిరాతో ముందుకు తీసుకెళ్లలేం. ముందుకు వెళ్లాలంటే రక్తమే అడుగుతుంది అనే డైలాగ్స్ ఉన్నట్టు నెటిజన్లు షేర్ చేసుకొంటున్నారు. మహేష్ బాబు షర్ట్ లేకుండా.. రక్తంలో తడిచిన వీడియో ఫ్యాన్స్‌కు క్రేజీగా మారినట్టు తెలుస్తున్నది. అయితే ఈ వీడియోను ఎక్కువగా ప్రచారం జరుగకుండా తొలగించే ప్రయత్నాలు వేగవంతం చేసినట్టు తెలిసింది.

## బిగ్ బాస్'లోకి సాధనా నాయుడు!?



బిగ్గెస్ట్ రియాలిటీ షోగా పాపులర్ అయిన 'బిగ్ బాస్' ఇప్పుడు పదో వసంతంలోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను అత్యంత విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు 'బిగ్ బాస్ 10: దశావతారం' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ముస్తాబవుతోంది.ప్రతి సీజన్‌లో సినిమా ప్రమోషన్స్, టాలీవుడ్ తారల సందడితో కోలాహలంగా మారే బిగ్ బాస్ వేదిక, ఈసారి పదింతల వినోదాన్ని పంచేందుకు సిద్ధమైంది. బిగ్ బాస్ 10కు సంబంధించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఎన్నో ఊహాగానాలు బయటకొస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ సారి బిగ్ బాస్ హౌస్ లోకి ఓ హాట్ లేడీ ఎంట్రీ ఇస్తున్నట్లు తెలుస్తోంది.ఆమె పేరు సాధనా నాయుడు. సోషల్ మీడియాలో తన ప్రత్యేకమైన కంటెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఇన్‌ఫ్లూయెన్సర్లలో ఈమె ఒకరు. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్, ట్రావెల్‌తో పాటు రోజువారీ జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన వీడియోలు, ఫోటోలు పంచుకుంటూ ఆమె సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్న ఈ పిల్ల ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికల్లో సందడి చేస్తుంటుంది.సోషల్ మీడియాలో ట్రెండ్స్‌కు అనుగుణంగా కొత్త తరహా కంటెంట్‌ను అందించడం ఆమె ప్రత్యేకత. అలాగే తన స్టైలిష్ ప్రెజెంటేషన్, ఆకట్టుకునే ఫోటోషూట్లు, ట్రెండింగ్ రీల్స్‌తో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తుంటారు సాధనా నాయుడు. డిజిటల్ క్రియేటర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీకి బిగ్ బాస్ ఆఫర్ వచ్చిందని, అందుకు ఆమె అంగీకారం కూడా ఇచ్చిందని టాక్.ఈ పేరు బయటకు రావడంతో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ కోసం వెతికే జనం అమాంతం పెరిగిపోయారు. ఆ పేజీలో సాధనా నాయుడు ఫొటోస్ చూసి.. సోషల్ మీడియాలోనే ఈ రేంజ్ మసాలా దట్టిస్తోందంటే ఇక బిగ్ బాస్ హౌస్ లో రచ్చే ఉంటుందేమో అని అంతా అంచనా వేస్తున్నారు.

# ఓటీటీ లోకి జన నాయగన్




తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు'). రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టడానికి ముందు విజయ్ నటించిన సినిమా కావడంతో, మొదటి నుంచి ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ వివాదాలు, తదితర కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని అడ్డంకులను దాటుకుని జూలై 23న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలైంది. మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకున్నప్పటికీ, విజయ్ క్రేజ్ కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగిన కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పుడీ సినిమా ఓటీటీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. 'జన నాయగన్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జీ5' ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. లేటెస్ట్ రిపోర్ట్స్ మేరకు, ఈ సినిమా ఆగస్టు 21వ తేదీ నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఒరిజినల్ తమిళ వెర్షన్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలోనే దీనిపై ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రానుంది. మాస్ చిత్రాల దర్శకుడు హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ యాక్షన్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ దాదాపు రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు ఒక ముఖ్యమైన పాత్రలో ఆకట్టుకుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పవర్‌ఫుల్ విలన్‌గా మెప్పించారు. వీరితో పాటు ప్రకాష్ రాజ్, ప్రియమణి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, నాజర్, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్




అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించారు.